
సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 14-2-2025 15/-




# మైనారిటీ రిపోర్ట్

## బీసీ హక్కుల సాధనకు మరో పోరు తప్పదు

-డా॥ ఖాలిద్ ముబష్షిరుజ్జఫర్,

జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షులు



**గీటురాయి వారపత్రిక**

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237

Email : geeturaiweekly@gmail.com

Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 7 హైదరాబాద్
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 రూ.15-00
14 షాబాన్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

సహనం చూప ప్రయత్నించిన వారికి దైవం సహనాన్ని ప్రసాదిస్తాడు. సహనం కన్నా ఉత్తమమైనది, అనేక మేళ్ళను సమకూర్చేది మరేదీ లేదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


కథ



26

**మానవత్వం గెలిచింది**

## లోపల...


| | | |
|---|---|---|
| మానవ విలువలే మతం | ...... | 04 |
| మైనారిటీ రిపోర్ట్ | ...... | 05 |
| మానవులారా! | ...... | 08 |
| ఇస్లామ్‌లో ఆధ్యాత్మిక వ్యవస్థ | ...... | 10 |
| అలీఘర్ ముస్లిం వ్విద్యాలయంలో విద్యాభ్యాసం చేసిన సమరయోధులు | ...... | 14 |
| బీసీ హక్కుల సాధనకు మరో పోరు తప్పదు | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| అంతర్జాతీయ కుట్రలు – ముస్లిం జగత్తు | ...... | 20 |
| ఇస్లామీయ ఉద్యమ లక్ష్యం-2 | ...... | 22 |
| హమారా సంవిధాన్... హమారా స్వాభిమాన్ | ...... | 24 |
| రాజ్యాంగం @ 75 – సవాళ్ళు | ...... | 28 |
| పదవీ విరమణ | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| తల్లిదండ్రులను గౌరవించాలి | ...... | 34 |


**తప్పుల తడక...**




(మాలలకు లబ్ధి చేకూర్చే కుట్ర
– మంద క్రిష్ణ)

ఎస్ సీ వర్గీకరణకు
కేబినెట్టు ఆమోదం
మరవలేని ఘట్టమని
ముఖ్యమంత్రి మోదం!

కుట్ర కోణముందని
మందకృష్ణ ఆవేదన
ఈమాటే మోషాలకు
యిస్తడంట నివేదన!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

## ఆలోచన

# మానవ విలువలే మతం

**కుంభమేళ** తొక్కిసలాటలో ఎంత మంది చనిపోయారో ఇదమిత్థంగా ఇప్పటికీ తెలియదు. ఆధ్యాత్మిక యాత్రలో విషాదం దేశప్రజలందరినీ కలిచివేసింది. ఈ విపత్కర పరిస్థితిలో ముస్లిములు ముందుకు వచ్చి అందించిన సేవలు ఇప్పుడు చర్చనీయాంశాలయ్యాయి. మౌని అమావాస్య రోజున ఈ తొక్కిసలాట జరిగింది. తొక్కిసలాట తర్వాత ప్రయాగ రాజ్‌లో చాలా ఆశ్రమాలు తలుపులు మూసేశాయన్న వార్త కూడా వచ్చింది. యూపీ ప్రభుత్వ టూరిజం అంబాసిడర్‌గా అక్కడికి వెళ్ళిన తానియా మిట్టల్ కూడా ఈ మాట చెప్పారు.

ఈ విపత్కర పరిస్థితిలో ముస్లిములు ముందుకొచ్చి బాధితులను ఆదుకున్న వార్తలు దేశంలో మతసామరస్యానికి మచ్చుతునకలు. బాధితులను ఆదుకోడానికి ముస్లిములు తమ ఇళ్ళలో ఆశ్రయమిచ్చారు. మస్జిదులు, దర్గాలు, మదరసాలను తెరిచి వారికి ఆశ్రయం కల్పించారు. వారి అన్నపానీయాలకు ఏర్పాట్లు చేసిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

ప్రయాగరాజ్‌లో మహాకుంభ్ జరుగుతున్నప్పుడు ముస్లిములు అక్కడికి రాకూడదని, అక్కడ దుకాణాలు పెట్టుకోరాదని సామాజిక బహిష్కరణ, విద్వేష ప్రచారాలు, బాయ్‌కాట్ పిలుపుల నేపథ్యంలో ఈ వార్తలను చూడాలి. ముస్లిం విద్వేష ప్రకటనలు చేసి దేశంలో మతసామరస్యాన్ని కలుషితం చేయాలనుకున్న వారికి చెంపపెట్టులా ఈ వార్తలు వచ్చాయి. ముస్లిములు మహాకుంభ్‌లో రాకూడదని నిషేధించడమే మంచిదయ్యింది లేకపోతే ఈ తొక్కిసలాటకు కారణం వారేనని మొత్తం నింద వారిపై మోపేవారని కూడా కొందరు విశ్లేషించారు. ఇలాంటి కార్యక్రమాల్లో ముస్లిములు వెళ్ళకపోవడమే మంచిదని, అక్కడ దుకాణాలు పెట్టకపోవడమే మంచిదని కూడా అశోక్ కుమార్ పాండే వంటి సోషల్ మీడియా ఇన్ ఫ్లూయన్సర్లు అన్నారు. మహాకుంభ్ సందర్భంగా ముస్లిములపై ఇంత విద్వేష ప్రచారం జరిగినప్పటికీ ముస్లిములు ఈ విపత్కర పరిస్థితిలో ముందుకు వచ్చి బాధితులకు ఆశ్రయం కల్పించడం మాత్రమే కాదు అన్నపానీయాలు, వైద్యం, ఔషధాలు అన్ని అందించి మానవ విలువలను చాటి చెప్పారు.

ప్రయాగరాజ్ ఒకప్పుడు అలహాబాద్. ఇక్కడ మహాకుంభ్ ఎప్పుడు జరిగినా స్థానిక ముస్లిములు, హిందువులు అందరూ దుకాణాలు పెట్టుకుని ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేవారు. కాని ఈసారి ముస్లిములను బాయ్‌కాట్ చేయాలని మతతత్వ శక్తులు పిలుపివ్వడంతో ఈ సామరస్యజలాల్లో విద్వేష విషం కలిసింది.

కాని ముస్లిములు ఇవేవీ పట్టించుకోలేదు. బాధితుల కోసం ఉచిత ఆహారాన్నందించే భండారాలు తెరిచారు. డా. నాజ్ ఫాతిమా వంటి వైద్యులు తమ క్లినిక్‌ను రిలీఫ్ సెంటరుగా మార్చి ఉచిత వైద్యం అందించారు. వేలాది మందికి అక్కడి ఇమాంబారాల్లో, మస్జిదుల్లో, మదరసాల్లో, దర్గాల్లో, ముస్లిం ఇండ్లలో ఆశ్రయమిచ్చి, చలికి తట్టుకునే ఏర్పాట్లు చేసి ఆదుకున్నారు. దైనిక్ భాస్కర్ ప్రకారం దాదాపు పది ప్రాంతాల్లో ఉచిత భోజన భండారాలు నడిపారు. మహాకుంభ్ కోసం వచ్చిన హిందూ భక్తులు తమ అతిథులని వారిని ఆదరించడం తమ కర్తవ్యమని స్థానిక ముస్లిములు చెప్పారు.

ప్రయాగరాజ్‌లో ముస్లిములు అందించిన సహాయ సహకారాలు దేశంలో విద్వేష శక్తులకు తగిన జవాబిచ్చాయని, భారతీయతకు నిదర్శనాలుగా నిలిచాయని చాలా మంది విశ్లేషించారు.

కరోనా సమయంలో కూడా ముస్లిములు ముందుకు వచ్చి అందించిన సేవలు అందరికీ తెలిసినవే. కాని తబ్లీగ్ జమాఅత్ పేరుతో కరోనా జిహాద్ అంటూ జరిగిన ప్రచారం కూడా అందరికీ తెలిసిందే. ఇక్కడ తెలంగాణాలో కాని, అక్కడ ఢిల్లీలో కాని కరోనా బాధితుల లెక్కలు చెబుతున్నప్పుడు మర్కజ్ వల్ల ప్రభావితులంటూ ప్రత్యేకంగా చెప్పిన లెక్కలు కూడా అందరూ విన్నారు. కరోనా సాకుతో ముస్లిములపై విద్వేష ప్రచారం జరుగుతున్నప్పుడు కూడా ముస్లిములు కరోనా బాధితులకు సేవలందించారు. గరికపాటి వారు ఒక ఇంటర్వ్యూలో ఈ విషయం స్పష్టంగా చెప్పారు. అలాగే గోరక్‌పూర్ ఆసుపత్రిలో చిన్నారులు ఆక్సిజన్ లేక మరణిస్తున్నప్పుడు అక్కడి డాక్టర్ కఫీల్ ఖాన్ నిస్వార్థంగా పసిపిల్లల ప్రాణాలు కాపాడ్డానికి చేసిన ప్రయత్నాలు మనకు తెలుసు, ఆ తర్వాత ఆ డాక్టరుపై యోగి ప్రభుత్వ వేధింపులు మనకు తెలుసు. విద్వేష, మతతత్వ శక్తులు తమ పని చేస్తున్నాయి. ముస్లిములు తమ పని చేస్తున్నారు. మానవ విలువలకు కట్టుబడి అవసరమైన వారికి సహాయమందిస్తున్నారు. ఈ వాస్తవాన్ని గమనించే వారు గమనిస్తూనే ఉన్నారు.

కవరు కథనం | అబ్దుల్ వాహెద్




# మైనారిటీ రిపోర్ట్

**బడ్జెట్ వచ్చేసింది.** కాని ఇందులో ఎక్కడా దేశంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేయడం గురించి ప్రస్తావన కూడా కనిపించలేదు. కొనప్రాణంతో ఉన్న ఉత్పాదక రంగానికి మళ్ళీ ప్రాణం పోసే ఆలోచనేది కనిపించలేదు. అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం కనిపించలేదు. ముఖ్యంగా కనిపించింది, చర్చల్లో విశ్లేషణల్లో వినిపించింది ఇన్‌కంటాక్సుకు సంబంధించి ఇచ్చిన మినహాయింపు. ఇప్పుడు పన్నెండు లక్షల రూపాయల వరకు వార్షికాదాయం ఉన్న వారికి టాక్సు మినహాయింపు ఉంది. అంటే ఆరు కోట్ల కన్నా ఎక్కువ మంది ఇప్పుడు ఈ పన్ను కట్టనవసరం లేదు.

కాని ఒకవైపు రూపాయి విలువ పడిపోతోంది. మరోవైపు నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయి. చమురు ధర పెరుగుతోంది. విదేశీ అప్పు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సామాజిక రంగానికి ఈ బడ్జెటు ఏమిచ్చింది? బలహీన వర్గాలకు ఏమిచ్చింది? అనే విషయాలు ఆలోచించవలసినవి.

రైతులు కనీస మద్దతు ధర కోసం ఆందోళన చేస్తున్నారు. ఈ సమస్య గురించి బడ్జెటులో ఏమైనా ఉందా? మన్రేగా వంటి స్కీములకు ప్రాముఖ్యం ఇవ్వడం ద్వారా బలహీన వర్గాలను ఆదుకునే ప్రయత్నాలేమైనా ఉన్నాయా?

సబ్ కా సాత్...సబ్ కా వికాస్...మోడీ ప్రభుత్వం చాలా గొప్పగా చెప్పుకున్న నినాదమిది. తమ ప్రభుత్వం అందరి ప్రభుత్వమని, అందరి సంక్షేమం కోసం పని చేసే ప్రభుత్వమని గొప్పగా ఇచ్చిన నినాదమిది. బడ్జెటులో తగిన కేటాయింపులు లేకపోతే సబ్ కా సాత్ సబ్ కా వికాస్ ఎలా సాధ్యం?

ప్రస్తుత బడ్జెటును చూస్తే ఈ నినాదం కేవలం నోటిమాట నొసటి వెక్కిరింత మాత్రమే అని స్పష్టమవుతోంది. ముఖ్యంగా మైనారిటీలకు ఏమిచ్చారన్నది చూస్తే ఇలాగే అనిపిస్తుంది.

దేశంలో మైనారిటీ సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం ఆసక్తి లేదన్నది గతంలో అనేకసార్లు స్పష్టమయ్యింది. ముస్లిం ఓట్లు అవసరమైనప్పుడు మాత్రం నోటి మాటగా కొన్ని పదాలు చెబుతారు అంతే. చేతల్లోకి వచ్చేసరికి అవసరమైన చర్యలు ఉండవు. ఈ బడ్జెటులో కూడా జరిగింది అదే. ఉద్దేశ్యపూర్వకంగా మైనారిటీలను ఉపేక్షించడం జరిగింది.

మైనారిటీ సముదాయాల పిల్లల భవిష్యత్తు చదువుతో ముడిపడి ఉంది. సచర్ కమిటి తదితర కమిటీలు, కమీషన్ల సిఫారసుల ద్వారా ఇంతకు ముందే స్పష్టంగా తెలిసిన విషయం మైనారిటీలు, ముఖ్యంగా ముస్లిం మైనారిటీలు విద్యాపరంగానే కాదు అనేక విధాలుగా వెనుకబడి ఉన్నారు. ఈ సముదాయాల్లో పిల్లల చదువును ప్రోత్సహించడం ద్వారా వారి ప్రగతివికాసాలకు తోడ్ప డడం దేశాభివృద్ధికి కూడా చాలా అవసరం. ఎందుకంటే, ఏదైనా సముదాయం వెనుకబడి ఉంటే మొత్తం దేశప్రగతిపై ఆ ప్రభావం పడుతుంది. కాని జరుగుతున్నదేమిటి? మైనారిటీ పిల్లల చదువుకు ఉపయోగపడే స్కాలర్ షిప్పులకు కోత పెడుతున్నారు. బడ్జెటు 2025-26లో ప్రిమెట్రిక్ స్కాలర్ షిప్పులకు కోత పెట్టారు.

గతంలో 2023-24 బడ్జెటులో ప్రీమెట్రిక్ స్కాలర్ షిప్పులకు 433 కోట్ల రూపాయలిచ్చారు. ఆ తర్వాతి సంవత్సరం దీనికి కోత పెట్టి 326.16 కోట్ల రూపాయలిచ్చారు. ఇప్పుడు కేవలం 195.70 కోట్ల రూపాయలిస్తున్నారు. దేశంలో దాదాపు 20 కోట్ల మంది ముస్లిం జనాభా ఉంది. కాని ప్రభుత్వం ఇస్తున్న కేటాయింపుల పరిస్థితి ఇది. ఈ కేటాయింపులను కూడా ఖర్చు పెట్టడం లేదు. 2023-24లో ఖర్చు పెట్టింది కేవలం 95.83 కోట్ల రూపాయలు మాత్రమే. ఆ తర్వాతి సంవత్సరం మరింత తగ్గింది, కేవలం 90 కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేశారు.

ఈ సంవత్సరం కేటాయింపులే తక్కువ. కాబట్టి నిధులు విడుదల చేయడం, ఖర్చు పెట్టడం కూడా ఇంకా, ఇంకా తక్కువే ఉంటుంది. నిజాయితీగా మాట్లాడుకోవాలంటే, ఈ ప్రభుత్వానికి మైనారిటీల ప్రగతి వికాసాలపై ఏ మాత్రం ఆసక్తి లేదు. మైనారిటీ పిల్లల చదువును మరింత కష్టతరం చేయడమే లక్ష్యంగా పెట్టు కున్నట్లు కనిపిస్తుంది.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పుల విషయంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఈసారి బడ్జెటులో 65 శాతం వరకు కోత పెట్టారు. మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్ షిప్పులు ప్రొఫెషనల్, టెక్నికల్ చదువులకు ఉద్దేశించినవి. గత సంవత్సరం 33.80 కోట్ల రూపా యలు కేటాయిస్తే, ఈ సంవత్సరం కేవలం 7.34 కోట్లు కేటా యించారు. విద్యార్జనకు రుణాలు, ముఖ్యంగా విదేశీ చదువులకు ఇచ్చే రుణాల విషయంలోను ఇదే వైఖరి. గత సంవత్సరం బడ్జెటులో 15.30 కోట్లు కేటాయిస్తే, ఈ సారి 8.16 కోట్లు కేటాయించారు.

మరోవైపు మదరసాల పట్ల ద్వేషభావం కనిపిస్తోంది. దేశంలో మదరసాలకు వ్యతిరేకంగా భారీస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. నిజానికి 2023-24 బడ్జెటులో మదరసాల్లో స్కీముల కోసం కేటాయింపులను 93 శాతం తగ్గించేశారు. ఆ తర్వాతి సంవ త్సరం ఏదో నామ్ కే వాస్తేగా 2 కోట్లు ఇచ్చారు. ఈ సంవత్సరం 0.01 కోట్లు ఇచ్చారు.

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కునే కుటుంబాల్లో పిల్లల చదువులకు స్కాలర్ షిప్పులు ఎంతో అవసరం. దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల పిల్లల చదువులకు ఈ స్కాలర్ షిప్పులు ఎలా అవసరమో అలాగే మైనారిటీ పిల్లల చదువులకు కూడా చాలా అవసరం. స్కాలర్ షిప్పుల మద్దతు లేకపోతే పేదరికంలో రోజు గడవడానికి కష్టపడే కుటుంబాలు పిల్లలను చదివించడం అసాధ్యమవుతుంది. కాని మోడీ ప్రభుత్వం మైనారిటీ పిల్లలు చదువుకోరాదనే భావిస్తు న్నట్లు కనిపిస్తోంది.

మైనారిటీలకు సంబంధించి 2024-25లో మోడీ ప్రభుత్వం మొత్తం ఆరు స్కీములకు గాను 1575.72 కోట్ల రూపాయలు కేటాయించింది. కాని విడుదల చేసిన నిధులు కేవలం 517.20 కోట్ల రూపాయలు. ఎంత ఖర్చు చేశారన్నది తెలియదు. దీనికన్నా చాలా తక్కువ ఉంటుందని ఊహించవచ్చు.

ఉదాహరణకు 2023-24లో 1689 కోట్ల రూపాయల బడ్జెటు కేటాయింపును ప్రకటించారు. అందులో 1500 కోట్ల నిధులు విడుదల చేశారు. కాని ఖర్చు పెట్టింది 428.74 కోట్ల రూపా యలు మాత్రమే. ఈ సంవత్సరం ఈ స్కీముల కోసం ప్రభుత్వ కేటాయింపులే 678.03 కోట్లు. ఇందులో ఎన్ని కోట్లు విడుదల చేస్తారు. అందులో ఎంత ఖర్చు పెడతారన్నది ఎవరికి వారే ఊహించుకోవచ్చు.

ఇక్కడ మరో విషయం గమనించాలి. ప్రధాని మోడీ గతంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ ప్రభుత్వం ముస్లిం విద్యార్థుల స్కాలర్ షిప్పులు రాజ్యాంగబద్ధం కాదని కోర్టులో కేసు వేసింది. దానివల్ల చాలా సంవత్సరాల పాటు ముస్లిం విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ స్కాలర్ షిప్పులు గుజరాత్‌లో లభించలేదు. క్లుప్తంగా చెప్పాలంటే మోడీ ప్రభుత్వం స్పష్టంగా, బాహాటంగా మైనారిటీ పిల్లల చదువుల పట్ల వ్యతిరేక వైఖరి కలిగి ఉంది.

ఇటీవల వక్ఫ్ బిల్లు పార్లమెంటులో చర్చకు వచ్చింది. తర్వాత జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఇచ్చారు. అక్కడ తూతు మంత్రం జరిపించి మళ్ళీ ప్రవేశపెట్టే ప్రయత్నాల్లో ఉన్నారు. వక్ఫ్ ను మెరుగు పరచడానికి ఇదంతా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటల్ని ముస్లిం మైనారిటీలు నమ్మడం లేదు. ఈ నమ్మకాన్ని మరింత పటిష్టపరిచేవిధంగా ప్రస్తుత బడ్జెటు వచ్చింది. ఎందుకంటే, వక్ఫ్‌ను మెరుగుపరచడానికి వక్ఫ్ బిల్లు తెచ్చామని చెప్పుకున్న ప్రభుత్వం ఇప్పుడు బడ్జెటులో వక్ఫ్ కోసం కేటాయింపుల్లో భారీ కోతలు పెట్టింది.

ఖౌమీ వక్ఫ్ బోర్డ్ తరక్కియాతీ స్కీమ్ ఇందులో ఒకటి. వక్ఫ్ బోర్డు నిర్వహిస్తున్న వక్ఫ్ ఆస్తులన్నింటినీ డిజిటలైజ్ చేయడానికి ఉద్దేశించిన స్కీము ఇది. అలాగే షహరీ వక్ఫ్ సంపత్తి వికాస్ యోజన మరో స్కీము. వక్ఫ్ సంస్థలు, వక్ఫ్ బోర్డులకు వక్ఫ్ ఆస్తుల అభివృద్ధి కోసం వడ్డీరహిత రుణాలివ్వడానికి ఉద్దేశించిన స్కీము ఇది. ఈ రుణాల ద్వారా పట్టణాల్లో ఉన్న వక్ఫ్ భూములపై ఆర్థికంగా లాభదాయకమైన కట్టడాలు అంటే బిజినెస్ కాంప్లెక్సులు, కల్యాణమంటపాలు, ఆసుపత్రులు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు వగైరా నిర్మించి ఈ ఆస్తులను వినియోగంలోకి తీసుకురావడం.

గతంలో ఈ రెండు స్కీములకు వేర్వేరుగా కేటాయింపులు ఉండేవి. కాని 2020-21లో రెండు స్కీముల కేటాయింపులను కలిపేసి ఒక్కటి చేశారు. 2023-24లో కేవలం 17 కోట్ల రూపాయలు కేటాయించారు. అందులో కేవలం 8 కోట్లు విడుదల చేశారు. చివరకు ఖర్చు పెట్టింది కేవలం 10 లక్షల రూపాయలు మాత్రమే. తర్వాతి సంవత్సరం 16 కోట్లు కేటాయించి, కేవలం 3.07 కోట్లు మాత్రమే విడుదల చేశారు. ఈ సంవత్సరం కేవలం 13 కోట్లు మాత్రమే కేటాయించారు. ఎంత విడుదల చేస్తారు? ఎంత ఖర్చు పెడతారన్నది ఊహించడం కష్టం కాదు.

మైనారిటీలకు సంబంధించి అనేక స్కీములను నిలిపేయడం కూడా జరిగింది.

స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌కు సంబంధించి నయీ మంజిల్, ఉస్తాద్, లీడర్ షిప్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీ విమెన్, హమారీ ధరోహర్ వంటి స్కీములు పూర్తిగా నిలిపేశారు.

UPSC, SSC, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ల పరీక్షల కోసం మైనారిటీ పిల్లలకు తోడ్పడే కార్యక్రమాలు కూడా ఆగిపోయాయి. మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, NMDFC (మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్) కేటాయింపులు పడిపోయాయి.

నిజానికి ఈసారి బడ్జెటులో గత సంవత్సరం బడ్జెటు కన్నా ఎక్కువ ఇచ్చామని చెబుతున్నారు. అంకెలు కూడా అలాగే కనిపిస్తున్నాయి. గత సంవత్సరం మైనారిటీల కోసం రూ.3183.24 కోట్లు కేటాయిస్తే, ఈ సంవత్సరం 3350 కోట్లు కేటాయించారు. కాని ఈ అంకెలను కాస్త నిశితంగా పరిశీలించడం అవసరం. ఎందుకంటే మైనారిటీ పిల్లల చదువు, వక్ఫ్, తదితర స్కీముల్లో కోతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ప్రభుత్వం ప్రకటించిన కేటాయింపులను తర్వాత సవరించి కొత్త కేటాయింపులు ప్రకటించడం కూడా మామూలే. ఉదాహరణకు గత సంవత్సరం మైనారిటీల కోసం రూ.3183.24 కోట్ల రూపాయలు ప్రకటించారు. తర్వాత సమీక్షలు చేసి 1868.18 కోట్ల రూపాయలకు సవరించారు. ఈ సంవత్సరం ప్రకటించిన రూ.3350 కోట్ల రూపాయలు సమీక్ష తర్వాత ఎంతవుతుందో వేచి చూడాలి.

మొత్తం 50.47 లక్షల కోట్ల రూపాయల దేశబడ్జెటులో మైనారిటీ సంక్షేమానికి కేటాయింపు 0.066 శాతం. స్కాలర్ షిప్పుల కేటాయింపులకు కోత పెట్టారు. ఫెలో షిప్పు, ఫ్రీ కోచింగ్ స్కీములు, విద్యారుణాలు అన్నింటికి కోత పెట్టారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి పథకాలు అన్నింటి పట్ల చిన్నచూపే కనిపిస్తుంది. మైనారిటీల కోసం కేటాయింపులు 2014 తర్వాతి నుంచి కోతలకు గురవుతూనే ఉన్నాయి. 2006లో మైనారిటీల కోసం 144 కోట్ల రూపాయలు కేటాయించారు. అదే సంవత్సరం మైనారిటీ వ్యవహారాల శాఖ ఏర్పాటయ్యింది. ముస్లిములు విద్యాపరంగా, ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారన్న నివేదికల తర్వాత ఈ శాఖను ఏర్పాటు చేసి ముస్లిం సంక్షేమానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి 2013-14 బడ్జెటు వరకు వరుసగా కేటాయింపులు పెరిగాయి. 2013-14 బడ్జెటులో రూ.3531 కోట్లు కేటాయించారు. ఆ తర్వాత మోడీ ప్రభుత్వ కాలంలో ఒక పద్ధతి ప్రకారం ప్రతి సంవత్సరం కేటాయింపుల్లోను, నిధుల విడుదలలోనూ, అసలు ఖర్చుల్లోనూ కోతలు కనిపిస్తూనే వున్నాయి. ఇప్పుడు ఇచ్చిన బడ్జెటు రూ.3350 కోట్లు కూడా నిజానికి యుపిఏ కాలంలో 2013-14 బడ్జెటులో కేటాయింపు రూ.3531 కోట్ల కన్నా తక్కువ. కేటాయింపుల్లోను, ఖర్చుల్లోను కనిపిస్తున్న పరిస్థితి గమనిస్తే, ఇదే పరిస్థితి కొనసాగితే మైనారిటీ వ్యవహారాల శాఖ కేవలం కాగితాలపై కనిపించే సంక్షేమం తప్ప మరేమీ కాదనే స్థాయికి రావచ్చు.

✤ ✤ ✤



**మనిషి ఎందుకు పుడతాడు? జాతులుగా ఎందుకు విభజింపబడ్డాడు? మనిషి చనిపోయాక మళ్లీ జన్మిస్తాడా? మనిషి ఎలా జీవించాలి..? ఎవరిని ఆరాధించాలి? తదితర ప్రశ్నలకు ఖుర్‌ఆన్ చెప్పే సమాధానాలను తెలుసుకొంటే ప్రతి ఒక్కరి జీవితం అర్థవంతంగా సాగుతుంది. ఇస్లాం ప్రకారం జీవితం అంటే ఒక పరీక్ష.. ఒక బాధ్యత. మరి ఆ బాధ్యతను ఎలా నెరవేర్చాలి? నెరవేర్చని వారికి పడే శిక్ష ఏమిటి అనే విషయాలను తెలుసుకోవాలంటే “మానవులారా!” వ్యాసం చదవాల్సిందే. ప్రవక్తలు చెప్పే సత్యాలను ఆచరిస్తూ ధార్మిక జీవనం సాగిస్తే ఎలాంటి సత్ఫలితాలు కలుగుతాయి? అల్లాహ్‌ను, ప్రవక్తలను నిత్య జీవితంలో ఎందుకు అనుసరించాలి? అల్లాహ్ మీద భయం, భక్తి కలిగి ఉంటే కలిగే లాభాలేమిటో ఈ వ్యాసం వివరిస్తుంది. ఈ భూమ్యాకాశాల్లో ఉన్నదంతా అల్లాహ్‌దే. సర్వజ్ఞుడు, వివేకి అయిన ఆయన చూపిన మార్గం కంటే వేరొక అత్యుత్తమ మార్గం లేదు! ప్రకృతి రూపంలో అల్లాహ్ ఇచ్చిన పాడి పంటలను బతకడానికి పరిమితంగా వాడుకుంటూ ఇహలోక సుఖాలు కొద్ది రోజులే అని గమనించి రుజు మార్గంలో జీవించాలి. ఇస్లాం ఇచ్చే సందేశం ఇదే. ఈ సందేశాన్ని సంక్షిప్తంగా, సరళంగా మీకోసం...**

# మానవులారా!

అర్షియా

### జాతులు, తెగలు ఎందుకు?

మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను. (దివ్యఖుర్‌ఆన్ 49: 13)

### ఎవరిని ఆరాధించాలి?

మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశంఉంది. మీ కొరకు భూమిని పాన్పుగాను, ఆకాశాన్ని కప్పుగాను సృష్టించినవాడూ, పైనుండి వర్షాన్ని కురిపించి, తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటుచేసి మీకు ఉపాధి కల్పించినవాడూ ఆయనే! ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్ సమానులుగా నిలబెట్టకండి. (దివ్యఖుర్‌ఆన్ 2: 21, 22)

### జీవితం పరీక్ష

మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతోమంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి. (దివ్యఖుర్‌ఆన్ 4: 1)

### ఒక్క ఈగనైనా సృష్టించగలరా?

మానవులారా! ఒక ఉదాహరణ ఇవ్వబడుతోంది దానిని శ్రద్ధగా వినండి: అల్లాహ్ ను కాదని మీరు ఏ దేవుళ్లను వేడుకుంటున్నారో, వారందరూ కలిసి సమైక్యంగా ఒక్క ఈగను సృష్టించదలచినా, అలా చేయలేరు. అంతేకాదు, ఒకవేళ ఈగ వారినుండి ఏదైనా వస్తువును లాక్కుపోయినా, వారు దానిని విడిపించుకురానూలేరు. సహాయాన్ని అర్థించేవారూ బలహీనులే, సహాయం కోసం అర్థింపబడేవారూ బలహీనులే. అల్లాహ్ గొప్పతనాన్నే వారు

గుర్తించవలసిన విధంగా గుర్తించలేదు. నిజానికి అల్లాహ్ మాత్రమే శక్తిమంతుడు, గౌరవనీయుడూను. (దివ్యఖుర్ఆన్ 22: 73,74)

## ఉపాధినిచ్చేదెవరు?

మానవులారా! అల్లాహ్ మీకు చేసిన ఉపకారాలను జ్ఞాపకం ఉంచుకోండి. అల్లాహ్ కాక, భూమ్యాకాశాల నుండి మీకు ఉపాధినిచ్చే మరొక సృష్టికర్త కూడా ఎవడైనా ఉన్నాడా - ఆయన తప్ప మరొక ఆరాధ్యుడెవ్వడూ లేడు. అసలు మీరు ఎవని వల్ల మోసపోతున్నారు? (దివ్యఖుర్ఆన్ 35 : 3)

## హెచ్చరిక

మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుండి మిమ్మల్ని మీరు రక్షించు కోండి. యథార్థం ఏమిటంటే, ప్రళయం నాటి భూకంపం మహా (భయంకర మైన) విషయం. దానిని మీరు చూచినప్పుడు దాని స్థితి ఎలా ఉంటుందంటే పాలు పట్టే ప్రతి స్త్రీ పాలు త్రాగే తన పాపను మరచిపోతుంది, ప్రతి గర్భిణి యొక్క గర్భం పడిపోతుంది, ప్రజలు మీకు మత్తులో ఉన్నట్లు కనిపిస్తారు, వాస్తవానికి వారు త్రాగి ఉండరు. కాని అల్లాహ్ శిక్షయే అంత తీవ్రంగా ఉంటుంది. (దివ్యఖుర్ఆన్ 22 : 1, 2)

## చనిపోయాక మళ్లీ పుట్టించబడతామా?

మానవులారా! ఒకవేళ మీకు మరణానంతర జీవితం గురించి ఏదైనా సందేహం ఉంటే, మీరు ఈ విషయాన్ని తెలుసుకోవాలి: మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాము, తరువాత వీర్య బిందువుతో, ఆ తరువాత నెత్తుటి గడ్డతో, ఆపై మాంసపు కండతో అది రూపం కలదిగానూ, రూపం లేనిదిగానూ ఉంటుంది. (మేము ఈ విషయాన్ని) మీకు యథార్థం ఏమిటో స్పష్టం చెయ్యాలని (తెలుపుతున్నాము). మేము కోరిన (వీర్య బిందువును) దానిని ఒక ప్రత్యేక కాలం వరకు మాతృగర్భాలలో నిలిపి ఉంచుతాము. తరువాత మిమ్మల్ని ఒక శిశువు రూపంలో బయటికి తీస్తాము. (ఆ తరువాత మీకు పెట్టి పోషిస్తాము) మీరు నిండు యౌవన దశకు చేరటానికి. మీలో ఒకడు ముందుగానే వెనుకకు పిలుచుకోబడతాడు, మరొకడు అతి నికృష్టమైన వయస్సు వైపునకు మరలింపబడతాడు, అంతా తెలిసిన తరువాత కూడ ఏమీ తెలియకుండా ఉండటానికి. ఎండిపోయిన నేలను మీరు చూస్తున్నారు, తరువాత మేము దానిపై వర్షం కురిపించగానే, అకస్మాత్తుగా అది పులక రిస్తుంది, ఉబుకుతుంది, ఇంకా అది అన్ని రకాల మనోహరమైన మొక్కలను మొలకెత్తించ టం ప్రారంభిస్తుంది. దీనికంతటికీ కారణం, అల్లాహ్ యే సత్యం కావటం, ఆయన మృతులను బ్రతికించటం, ప్రతిదానిపై అధికారం కలిగి ఉండటం ఇంకా (ఇది మరొక విషయానిక్కూడ నిదర్శనమే) ఏమిటంటే, ప్రళయఘడియ తప్పకుండా వచ్చి తీరుతుంది, ఇందులో ఏ అనుమానానికీ ఆస్కారం లేదు, గోరీల లోకి వెళ్ళిపోయినవారిని అల్లాహ్ తప్పకుండా లేపుతాడు.

(దివ్య ఖుర్ఆన్ 22: 5)

## మోసపోతున్నారా?

మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోండి. ఏ తండ్రీ తన కుమారునికి బదులుగా ముందుకు రాని, ఏ కుమారుడూ తన తండ్రికి బదులుగా నిలబడని ఆ రోజుకు భయపడండి, నిస్సందేహంగా అల్లాహ్ వాగ్దానం సత్యం. కనుక ఈ ఐహిక జీవితం మిమ్మల్ని మోసానికి గురిచేయకూడదు. వంచకులు మిమ్మల్ని అల్లాహ్ విషయంలో వంచనకు గురి చేయకూడదు. (దివ్యఖుర్ఆన్ 31 : 33 )

## క్షమాభిక్ష ఎవరికి?

మానవులారా! నిశ్చయముగా అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసానికి గురిచేయకూడదు. ఆ మహావంచకుడు కూడా మిమ్మల్ని అల్లాహ్ విషయంలో మోస గించగలగకూడదు. యథార్థానికి షైతాను మీకు శత్రువు. కనుక మీరు కూడా వాడు మీ శత్రువే అని భావించండి. వాడు, తన అనుచరులు నరక వాసులలో చేరిపోవాలని వారిని తన మార్గం వైపునకు పిలుస్తున్నాడు, అవిశ్వాసానికి పాల్పడే వారికి కఠిన శిక్ష పడుతుంది. విశ్వసించి మంచిపనులు చేసేవారికి క్షమాభిక్ష గొప్ప ప్రతిఫలం లభిస్తాయి. (దివ్యఖుర్ఆన్ 35 : 5,6)

## సత్యాన్ని స్వీకరించండి

మానవులారా! ఈ ప్రవక్త మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి సత్యం తీసుకువచ్చాడు. అతన్ని విశ్వసించండి, మీకే మంచిది. కాని మీరు గనక తిరస్కరిస్తే, ఆకాశాలలో, భూమిలో ఉన్నదంతా అల్లాహ్ దే అనే విషయం తెలుసుకోండి. అల్లాహ్ అన్నీ తెలిసిన వాడూ, అత్యంత వివేకీనూ. (దివ్యఖుర్ఆన్ 4 : 170)

## ఎవరిని అనుసరించాలి?

“మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాది స్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్ ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను - అతను అల్లాహ్ ను, ఆయన సూక్తులను విశ్వసిస్తాడు- అతనిని అనుసరించండి, మీరు సరియైన మార్గం పొందుతారేమో. (దివ్యఖుర్ఆన్ 7 : 158)

**మిగతా 13వ పేజీలో...**

# ఇస్లామ్‌లో ఆధ్యాత్మిక వ్యవస్థ

- డాక్టర్ సాజిద్ అబ్బాసీ

- ఆత్మప్రక్షాళనతో పాటు ఆధ్యాత్మిక పురోభివృద్ధికి హజ్రత్ ముహమ్మద్ (స) అస్తిత్వంలో గొప్ప ఆదర్శం
- ఆధ్యాత్మిక వికాసానికి ధార్మిక విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలి
- నఫిల్ ఆరాధనలతో ఎహ్‌సాన్ స్థాయికి చేరుకోండి

**నేటి** భౌతికవాద కాలంలో నాస్తికులు అల్లాహ్ ఉనికిని తిరస్కరించినట్లుగానే మనిషి ఆధ్యాత్మిక ఉనికినీ తిరస్కరిస్తారు. సృష్టిలో మనిషి ఉత్కృష్టమైన జీవి. మనిషి అత్యద్భుతమైన దేహం-ఆత్మతో పాటు నైతిక, ఆధ్యాత్మిక ఉనికి కలిగి ఉన్నాడు. బౌద్ధం, జైనం మినహా అన్ని మతాలు ఆధ్యాత్మికత భావనను కలిగి ఉన్నాయి. అన్ని మతాలలోనూ ఆధ్యాత్మికత అనేది దేవునితో మానవ ఆత్మకు ఉన్న సంబంధాన్ని సూచిస్తుంది. ఇస్లాంలో ఆధ్యాత్మిక భావన అంటే ఒక వ్యక్తి సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌తో సజీవ సంబంధాన్ని కలిగి ఉండటమే. అల్లాహ్ పట్ల ప్రేమ, కృతజ్ఞతా భావం కలిగి ఉండటం. సహనం, నమ్మకం, సంతృప్తి, విధేయత, దాస్య భావం, దాతృత్వం, ప్రార్థనలతో ఈ భావన వ్యక్తమవుతుంది. ఆత్మ ప్రక్షాళనతో ఆధ్యాత్మిక వికాసం కలుగుతుంది."పరిశుద్ధతను పాటించినవాడు తప్పక సాఫల్యం పొందుతాడు." (ఖుర్ఆన్, 87:14).. అని అల్లాహ్ చెప్పిన మాటలను మనం సదా గుర్తుంచుకోవాలి.

ఆధ్యాత్మికతను అర్థం చేసుకునే ముందు, ఆత్మను అర్థం చేసుకోవడం అవసరం. ఆత్మకు మూలం అల్లాహ్. ఆయన సర్వశక్తిమంతుడు, సృష్టికర్త, విశ్వ ప్రభువు. అల్లాహ్ ఆదమ్ (అలైహిస్సలామ్) శరీరాన్ని మట్టి నుండి సృష్టించినప్పుడు, అల్లాహ్ తన ఆత్మను ఊది ఊపిరి పోశాడు. "నేను అతణ్ణి పూర్తిగా తయారుచేసి, అతనిలో నా ఆత్మను కొద్దిగా ఊదినప్పుడు, మీరంతా అతని ముందు సాష్టాంగపడాలి." (15:29) అని అల్లాహ్ ఆదేశించాడు. మొదటిసారి అల్లాహ్ మానవుణ్ణి సృష్టించాక మానవ జాతి ఉనికి కొనసాగింపు కోసం చేపట్టిన సృజనాత్మక ప్రక్రియను గురించి ఖుర్ఆన్‌లో ఈ క్రింది విధంగా వివరించడం జరిగింది: "ఆయన మానవ సృష్టి ప్రారంభాన్ని మట్టితో చేశాడు. తరువాత అతని సంతతిని తుచ్ఛమైన ద్రవపదార్థం వంటి ఒక సారంతో కొనసాగించాడు. ఆ తరువాత అతనిని నఖశిఖ పర్యంతం తీర్చిదిద్దాడు. అతనిలోనికి తన ఆత్మను ఊదాడు. మీకు చెవులిచ్చాడు, కళ్ళిచ్చాడు, హృదయాలిచ్చాడు. అయినా మీరు

ఆయనకు కృతజ్ఞతలు తెలపటం చాలా తక్కువ.'' (32:8-9) ఆదమ్ (అలైహిస్సలామ్) సృష్టి, తదనంతరం మానవ జాతి, సృష్టి రెండింటి గురించి ఈ ఖుర్ఆన్ వాక్యం వివరించింది. తల్లి గర్భంలో పిండం ఏర్పడిన నాలుగు నెలల తర్వాత అల్లాహ్ ఒక దైవదూతను పంపి అందులో ఆత్మను నిక్షిప్తం చేస్తాడని హదీసు ద్వారా తెలుస్తున్నది (తిర్మిజి). అల్లాహ్ ఆత్మ నుండి ఊపిరి ఊదడం అంటే అల్లాహ్ తన ఉన్నతమైన లక్షణాలతో మనిషిని సృష్టించాడని అర్థం. ''ప్రవక్తా! ప్రవక్త అనుచరులారా!... ఏకాగ్ర చిత్తంతో మీ ముఖాన్ని ఈ ధర్మం దిశలో స్థిరంగా నిలపండి. అల్లాహ్ మానవులను ఏ స్వభావం ఆధారంగా సృష్టించాడో దానిపై స్థిరంగా ఉండండి. అల్లాహ్ సృజించిన స్వరూప స్వభావాలు మార్చటానికి శక్యం కానివి. ఇదే సవ్యమైన, సరళ ధర్మమార్గం, కాని చాలా మందికి ఇది తెలియదు'' (30:30) అని ఖుర్ఆన్‌లో ఉంది.

అల్లాహ్ మనిషిని తన స్వభావం రీత్యా సృష్టించారు. అంటే అల్లాహ్ తన అత్యున్నత గుణగణాలను రంగరించి మనిషిని సృష్టించాడు. మానవ ఆత్మ అల్లాహ్ ఆత్మలో భాగమని దీని అర్థం కాదు. ఇలాంటి భావన తప్పుదారి పట్టిస్తుంది. మానవ ఆత్మను ఖురాన్ మనస్సు అని వర్ణిస్తుంది. ''వారు భూమిపై సంచరించడం లేదా? వారి హృదయాలు అర్థం చేసుకోగలవిగా, వారి చెవులు వినగలవిగా కావటానికి? యథార్థం ఏమిటంటే, కళ్లు గుడ్డివి అవవు, కాని అంతరంగ హృదయాలు మాత్రం గుడ్డివి అయిపోతాయి'' (22:46) అని ఖుర్ఆన్ ప్రశ్నిస్తుంది. ఆత్మ నిరాకారమైనది. అది పైలోకం నుండి వచ్చి తిరిగి పై లోకానికి వెళుతుంది. అయితే మనిషి శరీరం మట్టి నుండి ఏర్పడి మరణం తర్వాత మట్టిలోనే కలిసిపోతుంది. ఆత్మ గురించి అడిగినప్పుడు, అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా పేర్కొన్నాడు: ''ఈ ప్రజలు నిన్ను ఆత్మను గురించి ప్రశ్నిస్తున్నారు. ఇలా అను: 'ఈ ఆత్మ నా ప్రభువు ఆజ్ఞానుసారం వస్తుంది. కాని మీకు ప్రసాదించిన జ్ఞానం చాలా తక్కువ.'' (17:85)

ఆత్మను దైవదూత ద్వారా శరీరంలో నిక్షిప్తం చేసాడు అల్లాహ్. దైవంతో అనుసంధానమై ఉన్నంత కాలం మనిషి ఆత్మ సంతృప్తికర స్థితిలో ఉంటుంది. ఖుర్ఆన్ ఇలా పేర్కొంటోంది... ''తెలుసుకోండి! అల్లాహ్ సంస్మరణ ద్వారానే హృదయాలకు తృప్తిని పొందే భాగ్యం లభిస్తుంది.'' (అర్రాద్ : 28) మనస్సులో వచ్చిన సందేహాలన్నింటికీ సమాధానాలతో సంతృప్తి చెందిన హృదయమే సంతృప్తి చెందుతుంది. మనసు (ఆత్మ లేదా హృదయం)కు సన్మార్గం లభించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. మనం చేరాల్సిన గమ్యస్థానంతో పాటు వెళ్లే మార్గమూ తెలిసినప్పుడే ప్రయాణం సుఖవంతం అవుతుంది. అల్లాహ్‌యే మానవ హృదయాలకు మూలం కాబట్టి, అల్లాహ్ సంస్మరణ ద్వారానే హృదయాలకు నెమ్మది లభిస్తుంది. అల్లాహ్ స్మరణలో ఖుర్ఆన్ పారాయణం కూడా ఇమిడి ఉంది. ఖుర్ఆన్ అల్లాహ్ వాక్కు. ఇందులోని వాదనలన్నీ ఆధారాలతో నిరూపించబడ్డాయి. సన్మార్గం పొందిన హృదయమే సంతృప్తి చెందుతుంది. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ అలాంటి హృదయంలో ప్రశాంతత ఆవరిస్తుంది. మార్గదర్శకత్వం లేని, చెడు మార్గం పట్టిన హృదయం కలత చెందుతుంది. ఎన్ని విలాసాలు, ఎన్ని సుఖాలు, సౌకర్యాలు ఉన్నా అలాంటి ఆత్మకు మనశ్శాంతి కరువవుతుంది. రాత్రిపూట నిద్ర కరువవుతుంది, మానసిక ఒత్తిడి బాధ పెడుతుంది. ఇలాంటి వారిలో కొందరు ఆత్మహత్యలకు పాల్పడతారు.

మనిషి అంతరంగ నైతిక స్వభావం అతన్ని మంచీ, చెడుల విచక్షణ తెలుపుతుంది. మనిషి తన ఇష్టానుసారం మంచినో, చెడునో ఎంచుకుంటాడు. తన ఆలోచనా స్వేచ్ఛతో తీసుకున్న నిర్ణయాలకు, చేసే పనులకు అతనిదే బాధ్యత. ఈ విషయం గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొంది... ''మానవాత్మ సాక్షిగా, ఆ ఆత్మను తీర్చిదిద్ది ఆపై దానికి సంబంధించిన మంచీ చెడులను దానికి తెలియజేసినవాడు, నిశ్చయంగా తన ఆత్మను పరిశుద్ధ పరచుకున్న వ్యక్తి సఫలుడయ్యాడు. దానిని అణచి వేసినవాడు విఫలుడయ్యాడు'' (91:7-10). మానవ ఆత్మ అల్లాహ్ గొప్ప సృష్టి. ఇందులో నైతికతతో పాటు అనైతిక భావనలూ నిండి ఉన్నాయి. కోరికలు, ఆకర్షణలూ ఉన్నాయి. ఆత్మ శుద్ధి అంటే తప్పుడు నమ్మకాలు, తప్పుడు ఉద్దేశాలు, అపోహలు, అశ్లీలత నుండి విముక్తి పొందడం. చెడు మాలిన్యాల నుండి పరిశుద్ధమవడం. ఖురాన్ పఠిస్తూ, అల్లాహ్ స్మరణను చేస్తూ ఆత్మకు ఆహారం అందించి ఆత్మను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం.

అల్లాహ్ హద్దులలో ఉంటూ కోరికలను తీర్చుకోవాలి. ఇది మనిషికి పెద్ద పరీక్ష. ఈ పరీక్షలో నెగ్గితే ఆధ్యాత్మికంగా అతడు అత్యున్నత శిఖరానికి చేరుకుంటాడు. ఇది ఇస్లామ్‌లోని సౌందర్యం. మానవ ఆత్మ ఎప్పుడూ పశుపక్ష్యాదుల శరీరంలో నివసించదు. మనిషి పుట్టింది కోతి నుండే అనుకుంటే, పరిణామ క్రమంలో హఠాత్తుగా మనిషిలో సిగ్గు, బిడియాలు అనే భావాలు ఎందుకు వచ్చాయి

అనే ప్రశ్న తలెత్తుతుంది. పూర్వ జన్మలో చేసుకున్న కర్మలకు శిక్షగా పశువుగా పుట్టడమన్నది ఇస్లామీయ విశ్వాసాలకు పూర్తిగా విరుద్ధమైనది. మానవ ఆత్మకు, జంతువుల ఆత్మకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. మానవ ఆత్మ ఉన్నత లక్షణాలను కలిగి ఉంటుంది.

ఇస్లాంలో ఆత్మ, శరీరం, వివేకం, వివేచనల సాయంతో ఒక వ్యక్తి ఇహలోకంలో, పరలోకంలో విజయం సాధించగలడు. మనిషి భౌతికంగా జీవించడానికి గాలి, నీరు, ఆహారం, దుస్తులు, ఇల్లు అవసరం. ఆత్మ సజీవంగా ఉండాలంటే అల్లాహ్‌తో సంబంధం కలిగి ఉండాలి. తల్లి కడుపులో ఉన్న శిశువుకు బొడ్డు తాడు నుండి ఆహారం అందినట్లుగా, అల్లాహ్‌తో ఉన్న సంబంధం ద్వారా ఆత్మకు ఆధ్యాత్మిక ఆహారం అందుతుంది. మరే ప్రాణికీ ఇవ్వనంత మేధస్సు మనిషికి అల్లాహ్ ఇచ్చాడు. మనిషి మేధస్సు హేతుబద్ధమైన వాటిని, అహేతుకమైన వాటిని వేరు చేస్తుంది. ఆత్మ ఏదైనా చేయాలనుకున్నప్పుడు, మెదడు శరీరంలోని అవయవాలకు ఆదేశాలు పంపుతుంది. తద్వారా అనుకున్న పని అమలవుతుంది. ఇతర మతాలు శరీరాన్ని ఆత్మకు జైలుగా అభివర్ణిస్తాయి. ఆత్మ వికాసం కోసం మానవ అవసరాలను అణిచి వేయడాన్ని అవి అవసరంగా పేర్కొన్నాయి. సుఖవంతమైన జీవితాన్ని వదిలి పర్వతాలకు, గుహలకు వెళ్లి తపస్సు చేసుకోవడం, వైవాహిక జీవితాన్ని వదిలి బ్రహ్మచారిగా మారడాన్ని ఖుర్‌ఆన్ వైరాగ్యంగా పేర్కొంటోంది. ఇవి అల్లాహ్ నుండి వచ్చిన ఆదేశాలు కావు, ఇవి మానవులు స్వయంగా విధించుకున్న ఆంక్షలు.

మనిషి తన అవసరాలను తీర్చుకుంటూ ఆత్మ వికాసం సాధించ గలడని ఇస్లామ్ సూచిస్తుంది. దీనికోసం ఇస్లామ్ ఆత్మను అణచి వేయడం కాకుండా స్వీయ నిగ్రహాన్ని నేర్పుతుంది. అల్లాహ్ చట్టం సహజ అవసరాలను తీర్చుకునే అనుమతినిస్తుంది. ఇది ఒక వ్యక్తిని ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థానానికి తీసుకు వెళుతుంది. ఇస్లామ్ అతివాదం-మితవాదాలను కాకుండా మధ్యే మార్గాన్ని బోధిస్తుంది. హద్దుల్లేని కోరికలు, ఆత్మ అణిచివేతను వ్యతిరేకిస్తుంది. మంచి ఆహారం తినడానికి, మంచి బట్టలు ధరించడానికి, మంచి ఇంట్లో నివసించడానికి, వివాహం చేసుకోవడానికి ఇస్లామ్ అనుమతినిస్తుంది. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపే దాసులుగా మానవులు మెలగాలన్నది ఇస్లామ్ బోధనల సారాంశం. అల్లాహ్ ఆరాధనలో మరెవరినీ భాగస్వామ్యం చేయరాదు. హలాల్ పద్ధతిలో సంపాదించి, ఎవరి హక్కులనూ కొల్లగొట్టకుండా, ఎవరినీ హింసించకుండా, తోటివారి హక్కులను నెరవేర్చి ఉన్నత నైతిక విలువలను పాటించాలని ఇస్లామ్ బోధిస్తున్నది. అందుకే ఆరాధనను అల్లాహ్ విధిగా చేశాడు. మనిషిని పరీక్ష కోసం ఆయన పుట్టించాడు. అందుకే మనిషి మనసులో మంచీ, చెడులను ఉంచాడు. మూడు రకాల మనసులు అల్లాహ్ ఉంచాడు. నఫ్సె అమ్మార (చెడు వైపునకు పురికొలుపుతుంది), నఫ్సె లవ్వామ (చెడు జరిగిన తరువాత పశ్చాత్తాపం చెందేలా చేస్తుంది), నఫ్సె ముత్మయిన్నహ్ (నిత్యం మంచి వైపునకు మరలేలా చేస్తుంది). ఒక దాసుడి ఆత్మ అల్లాహ్‌తో సంబంధాన్ని త్రెంచుకున్నప్పుడు అలాంటి వారి ఆత్మ షైతాన్‌తో సంబంధం ఏర్పరచుకుంటుంది. షైతాన్ కోరికలను ఉసిగొలుపుతాడు. కోరికలకు బానిసగా చేసివేస్తాడు. హృదయంలో లేనిపోని సందేహాలను, అపోహలను కలిగిస్తాడు. దేవుని ఏకత్వం, పరలోక విశ్వాసం, దైవదౌత్యం పట్ల లేనిపోని సందేహాలు కల్పించి విశ్వాసానికి దూరం చేస్తాడు. ఒక వ్యక్తి నమాజును ఆచరించడంతో పాటు ఖురాన్‌ను అవగాహనతో చదవడానికి ప్రయత్నిస్తే, అతని సందేహాలు, అపోహలన్నీ తొలగిపోతాయి. మనిషి నమాజుతో సంబంధం కొనసాగించినంత కాలం షైతాన్ దాడుల నుండి రక్షించబడతాడు. అల్లాహ్‌తో సంబంధాన్ని కొనసాగించడానికి, నమాజు తప్పనిసరి విధి. ఇది అల్లాహ్ స్మరణను శాశ్వతం చేస్తుంది. “నేనే అల్లాహ్‌ను, నేను తప్ప మరొక దేవుడు లేడు. కనుక నీవు నాకు దాస్యం చెయ్యి. నా జ్ఞాపకం కోసం నమాజును స్థాపించు” అని ఖుర్‌ఆన్‌లో ఉంది. (20:14)

**(మిగతా వచ్చేవారం)**



9వ పేజీ తరువాయి...

## వాళ్ల నరకానికి మిత్రులు

ఓ ప్రవక్తా! ఇలా అను, "మానవులారా! నేను మీకు కేవలం (కష్టకాలం రాకముందు) స్పష్టంగా హెచ్చరించే వ్యక్తిని మాత్రమే." కనుక విశ్వసించి మంచి పనులు చేసేవారికి క్షమాభిక్ష లభిస్తుంది, గౌరవ ప్రదమైన ఉపాధి కూడ లభిస్తుంది. మా ఆయతులను కించపరచటానికి ప్రయత్నం చేసే వారు నరకానికి మిత్రులు. (దివ్య ఖుర్ఆన్ 22 : 49-51)

## మార్గం చూపే జ్యోతి

మానవులారా! మీ ప్రభువు తరపు నుండి మీ వద్దకు స్పష్టమైన నిదర్శనం వచ్చింది. మేము మీ వద్దకు మీకు స్పష్టంగా మార్గం చూపే జ్యోతిని పంపాము. ఇక అల్లాహ్ మాటను ఆలకించే వారిని, ఆయన శరణువేడుకునే వారిని అల్లాహ్ తన కరుణతో తన అనుగ్రహంతో కప్పివేస్తాడు. వారికి తన వైపునకు వచ్చే రుజుమార్గం చూపుతాడు. (దివ్యఖుర్ఆన్ 4 : 174,175)

## స్వస్థత చేకూర్చే ఔషధం

మానవులారా! మీవద్దకు మీ ప్రభువు తరపునుండి హితోపదేశం వచ్చేసింది. అది హృదయాల వ్యాధులకు స్వస్థత. దానిని స్వీకరించే వారికి అది మార్గదర్శకత్వం, కారుణ్యం. ప్రవక్తా ఇలా అను : "అల్లాహ్ తన అనుగ్రహం వల్ల తన కారుణ్యం వల్ల దానిని పంపాడు. దానికి ప్రజలు సంబరపడాలి. ప్రజలు కూడబెట్టే వాటన్నింటికంటే అది ఉత్తమమైనది." (దివ్యఖుర్ఆన్ 10 - 57, 58)

## విశ్వాసులుగా మారండి

ప్రవక్తా ఇలా అను: "మానవులారా! మీరు గనక ఇంకా నా ధర్మం గురించి ఏదైనా సంశయం కలిగివుంటే, వినండి, మీరు అల్లాహ్ ను కాదని ఆరాధించే వారిని నేను ఆరాధించను. ఏ దేవుని అధీనంలో మీ మరణం ఉన్నదో ఆ దేవుడినే నేను ఆరాధిస్తాను. నేను విశ్వాసులలో ఒకడిగా ఉండాలని నాకు ఆదేశం ఇవ్వబడింది. నాతో ఇలా అనబడినది: ఏకాగ్రతతో చిత్తశుద్ధితో నిన్ను నీవు పూర్తిగా ఈ ధర్మానికి సమర్పించుకో. ముష్రిక్కులలో ఎంత మాత్రమూ కలిసిపోకు. (దివ్యఖుర్ఆన్ 10 : 104, 105)

## ఆలోచించండి

ప్రజలారా! మీరు చేసే ఈ తిరుగుబాటు మీకే హాని కలిగిస్తుంది. ఇహలోక జీవిత సుఖాలు కొన్ని రోజుల సుఖాలు మాత్రమే. (వాటిని అనుభవించండి). తరువాత మా వైపునకే మీరు మరలి రావలసి ఉన్నది. అప్పుడు మేము మీకు తెలుపుతాము, మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో. ఈ ప్రాపంచిక జీవితాన్ని (దాని నిషాలో పడి మీరు మా సూచనల పట్ల అశ్రద్ధ వహిస్తున్నారు) ఇలా పోల్చవచ్చు - మేము ఆకాశం నుండి నీటిని కురిపించగా మనుషులూ పశువులూ అందరూ తినే భూఉత్పత్తులు బాగా దట్టంగా తయారయ్యాయి. ఆపై భూమి మంచి స్థితిలో ఉన్నప్పుడు పొలాలు బాగా పండి శోభిల్లుతూ ఉన్నప్పుడు వాటి యజమానులు, "ఇక మేము వాటివల్ల లాభం పొందగలము" అని అనుకుంటున్న సమయంలో, అకస్మాత్తుగా రాత్రి వేళనో పగటిపూటనో మా ఆజ్ఞ వచ్చేసింది. అప్పుడు మేము అసలు అక్కడ నిన్న ఏమీ లేనట్లు దానిని సర్వనాశనం చేశాము. ఇలా మేము మా సూచనలను స్పష్టంగా వివరిస్తాము. ఆలోచించే వారి కొరకూ అర్థం చేసుకునే వారికొరకు. (దివ్యఖుర్ఆన్ 10 - 24)

## హితబోధ స్వీకరించండి

ముహమ్మద్! ఇలా చెప్పు : "మానవులారా! మీ వద్దకు మీ ప్రభువు తరపు నుండి సత్యం వచ్చేసింది. ఇప్పుడు ఎవడైనా రుజు మార్గాన్ని అవలంబిస్తే అతడి రుజుమార్గ అనుసరణం అతనికే లాభదాయకం. ఎవడైనా మార్గం తప్పితే అతడి ఆ మార్గం తప్పటం అతనికే వినాశకరం. నేను మీకు కావలివాణ్ణి మాత్రం కాను." ప్రవక్తా! నీవు నా వద్దకు వహీ ద్వారా పంపబడుతూ వున్న హితబోధను అనుసరిస్తూ ఉండు. అల్లాహ్ తీర్పు చేసేవరకు ఓర్పు వహించు. ఆయన మాత్రమే ఉత్తమంగా తీర్పు చేసేవాడు. (దివ్యఖుర్ఆన్ 10 - 109)

## షైతాన్ మార్గం వద్దు

ప్రజలారా! భూమిలోని ధర్మసమ్మతమైన, పరిశుభ్రమైన వాటినన్నింటినీ మీరు తినండి. షైతాను చూపే మార్గాలను తొక్కకండి. వాడు మీకు బహిరంగ శత్రువు. దుర్మార్గాన్నీ, అశ్లీలాన్నీ చెయ్యండి అని వాడు మిమ్మల్ని ఆజ్ఞాపిస్తాడు. ఏ విషయాలను గురించి అయితే (అల్లాహ్ చెప్పినట్లు) మీకు తెలియదో ఆ విషయాలను అల్లాహ్ పేరుతో చెప్పండి అని మిమ్మల్ని ప్రేరేపిస్తాడు. (దివ్యఖుర్ఆన్ 2 : - 169)

## అల్లాహ్ వైపునకే అందరూ మరలాలి

మానవులారా! అల్లాహ్ అవసరం కలవారు మీరే. అల్లాహ్ సర్వసంపన్నుడు. స్వయంగానే స్తుతిపాత్రుడు. ఆయన కోరితే, మిమ్మల్ని తొలగించి, మరేదైనా సృష్టిని మీ స్థానంలో తీసుకు రాగలడు. అలా చేయటం అల్లాహ్‌కు ఏ మాత్రమూ కష్టం కాదు. బరువు మోసే వాడెవ్వడూ మరెవరి బరువునూ మోయడు, బరువును మోసే ఆత్మ ఏదైనా తన బరువును మోయ మని ఇతరులను పిలిచినప్పుడు, దాని బరువు రవ్వంత భాగాన్నయినా ఎత్తుకోవటానికి ఎవ్వడూ ముందుకు రాడు, అతడు ఎంత సమీప బంధువైనా సరే. (ప్రవక్తా) చూడకపోయినప్పటికీ తమ ప్రభువు నకు భయపడే వారినీ, నమాజును స్థాపించేవారిని మాత్రమే నీవు హెచ్చరించగలవు. ఏ వ్యక్తి అయినా తన మేలు కొరకే పరిశుద్ధతను అవలంబిస్తాడు. అల్లాహ్ వైపునకే అందరూ మరలవలసి ఉన్నది. (దివ్యఖుర్ఆన్ 35 - 15-18)





# అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు

ముహమ్మద్ అజ్గర్ అలీ

గత సంచిక తరువాయి...

### 8. మౌలానా షౌకత్ అలీ (1873-1938)

అలీ సోదరులలో పెద్దవారు మౌలానా షౌకత్ అలీ. తమ్ముడు ముహమ్మద్ అలీకి ఉర్దూ వారపత్రిక హమ్‌దర్ద్ మరియు ఆంగ్ల వారపత్రిక కామ్రేడ్ ప్రచురించడంలో మౌలానా షౌకత్ అలీ సహాయం చేశారు. 1915లో మౌలానా షౌకత్ అలీ ఒక వ్యాసం ప్రచురించారు, అందులో టర్కులు బ్రిటిష్ వారితో పోరాడటం సరైనదేనని పేర్కొన్నారు. 1919లో, జైలు శిక్ష అనుభవించినప్పుడు, మౌలానా షౌకత్ అలీ ఖిలాఫత్ సమావేశానికి చివరి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సహాయ నిరాకరణ ఉద్యమం (1919-1922) సమయంలో బ్రిటిష్ వారు మౌలానా షౌకత్ అలీని 1921 నుండి 1923 వరకు జైలులో పెట్టారు.

మౌలానా షౌకత్ అలీ విప్లవాత్మక స్వాతంత్ర్య ఉద్యమానికి మద్దతుదారు. మౌలానా 1928 నెహ్రూ నివేదికను వ్యతిరేకించారు. ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు కావాలని డిమాండ్ చేశారు 1930-31లో లండన్‌లో జరిగిన మొదటి, రెండవ రౌండ్ టేబుల్ సమావేశాలకు (భారతదేశం) హాజరయ్యారు. మౌలానా 1934 నుండి 1938 వరకు బ్రిటిష్ ఇండియాలో 'సెంట్రల్ అసెంబ్లీ' సభ్యుడిగా పనిచేశారు. మధ్యప్రాచ్యం అంతటా పర్యటించి, భారతదేశ ముస్లింలకు మద్దతును, భారతదేశంలో బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం కోసం పోరాటాన్ని పెంపొందించారు.

### 9. మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్ (1878-1931)

మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్ MAO కళాశాలలో, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నారు. ముహమ్మద్ అలీ జౌహర్ మహాత్మా గాంధీతో కలిసి సహాయ నిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమాన్ని ప్రారంబించారు. ది టైమ్స్, లండన్, ది మాంచెస్టర్ గార్డియన్, ది అబ్జర్వర్ వంటి ప్రముఖ భారతీయ, విదేశీ వార్తాపత్రికలలో రచనలు చేసేవారు.

1911 సంవత్సరంలో ముహమ్మద్ అలీ జౌహర్ కలకత్తాలో "ది కామ్రేడ్" పత్రికను ప్రారంభించారు. 1913లో హమ్‌దర్ద్ అనే ఉర్దూ దినపత్రికను ప్రారంభించారు. పౌర ప్రతిఘటన ఉద్యమంలో పాల్గొన్నారు. రెండు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్ జామియా మిల్లియా ఇస్లామియా వ్యవస్థాపకులలో ఒకరు. దాని మొదటి వైస్ ఛాన్సలర్.

మౌలానా 1923లో INC అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1930లో లండన్‌లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లారు. 1931 జనవరి 4న లండన్‌లో మరణించిన మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్‌ను డోమ్ ఆఫ్ రాక్ సమీపంలో జెరూసలేంలో ఖననం చేశారు.

### 10. అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ (1905-1973)

అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ ప్రముఖ భారతదేశ స్వాతంత్ర్య సమరయోధులు. జాతీయ సమైక్యత, లౌకికవాదం, మత సామరస్యం పట్ల నిబద్ధతకు ప్రసిద్ధి చెందారు. అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ తాను అధ్యక్షుడిగా ఉన్న ఆల్-ఇండియా మోమిన్ కాన్ఫరెన్స్ ద్వారా జిన్నా ద్విజాతి సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడారు. పాకిస్తాన్ ఆలోచననే అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ తీవ్రంగా వ్యతిరేకించారు.

అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక జాతీయ పాఠశాలను స్థాపించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 16 సంవత్సరాల వయస్సులోనే అరెస్టు చేయబడి జైలు పాలయ్యారు. అన్సారీ సమాజంలోని బలహీన వర్గాలకు మద్దతు దారుడు. అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ మోమిన్ కాన్ఫరెన్స్ అగ్ర నాయకులలో ఒకరు. అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ INCతో కలిసి 1928లో కలకత్తాలో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళనలో పాల్గొన్నారు. అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ ఒక నిష్ణాతుడైన జర్నలిస్ట్, రచయిత, కవి.

### 11. అలీ సర్దార్ జాఫ్రీ (1913-2000)

అలీ సర్దార్ జాఫ్రీ తిరుగుబాటుదారులు, స్వాతంత్ర్య సమర యోధులు, శాంతికాముకులు, రాడికల్ కార్యకర్త, కథా రచయిత, విమర్శకుడు. డాక్యుమెంటరీ చిత్రనిర్మాత. 20వ శతాబ్దపు ఉర్దూ కవిత్వ ప్రముఖ ఆధునిక కవి. అలీ సర్దార్ జాఫ్రీ కవిత్వం ప్రధాన ఇతివృత్తం కరుణ, ప్రేమ, పట్టుదల, సున్నితత్వం. అలీ సర్దార్ జాఫ్రీ మానవ స్ఫూర్తి, ఆదర్శ ప్రాయమైన మనుగడను తన కవిత్వంలో చిత్రీకరించారు.

అలీ సర్దార్ జాఫ్రీ ప్రారంభ రచనలు వలసరాజ్యాల నుండి భారత దేశం స్వాతంత్ర్యం పొందాలనే విరామం లేని కోరికను ప్రతిబింబి స్తాయి. 1938లోనే, అలీ సర్దార్ జాఫ్రీ కలకత్తాలో జరిగిన ప్రోగ్రెసివ్ రైటర్స్ ఉద్యమం సమావేశంలో పాల్గొన్నారు. అలీ సర్దార్ జాఫ్రీ కవిత్వంపై మార్క్సిజం ప్రభావం చాలా లోతైనది, శాశ్వతమైనది. 1986లో AMU అలీ సర్దార్ జాఫ్రీకి డాక్టరేట్ (డి. లిట్.) ప్రదానం చేసింది

### 12. కె.ఎం. అష్రఫ్ (1903-1962)

కున్వర్ ముహమ్మద్ అష్రఫ్ ఒక ప్రముఖ చరిత్రకారుడు, ఇస్లామిక్ అధ్యయనాల పండితులు, కమ్యూనిస్ట్ నాయకులు. హిందూ-ముస్లిం ఐక్యతకు నాయకత్వం వహించారు. సహాయ నిరాకరణ ఉద్యమం సమయంలో, కున్వర్ మొహమ్మద్ అష్రఫ్ MAO కళాశాలను విడిచిపెట్టి కొత్తగా ఏర్పడిన జామియా మిల్లియాలో చేరారు. తరువాత కున్వర్ ముహమ్మద్ అష్రఫ్ 1923లో AMUలో M.A. (చరిత్ర), LL.B. కోర్సులను అభ్యసించ డానికి తిరిగి చేరారు. కున్వర్ ముహమ్మద్ అష్రఫ్ లండన్ విశ్వవిద్యాలయంలోని SOAS నుండి Ph.D. పట్టా పొందారు.

కున్వర్ ముహమ్మద్ అష్రఫ్ AMU ప్రొఫెసర్ మొహమ్మద్ హబీబ్ ప్రభావంతో సోషలిస్ట్ ఉద్యమంలో చేరారు. రష్యన్ విప్లవం ద్వారా ప్రేరణ పొంది, 1934లో ఏర్పడిన కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

చేరాడు. 1933-34లో రైతు పోరాటానికి నాయకత్వం వహించాడు. జవహర్‌లాల్ నెహ్రూకు నమ్మకమైన సహచరుడు. 1934-45 వరకు AICC సభ్యుడు.

1937-39లో కాంగ్రెస్ పార్టీ "ముస్లిం మాస్ కాంటాక్ట్ క్యాంపెయిన్ సెల్"కు కున్వర్ ముహమ్మద్ అష్రఫ్ నాయకత్వం వహించారు. అష్రఫ్ భారతీయ ముస్లింలను స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనమని ప్రోత్సహించారు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు వారికి కార్యదర్శిగా పనిచేశారు. కున్వర్ ముహమ్మద్ అష్రఫ్ 1948లో దినపత్రిక నయా దౌర్‌కు సంపాదకుడు.

కున్వర్ ముహమ్మద్ అష్రఫ్ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో బోధించారు. 1960లో బెర్లిన్‌లోని హంబోల్ట్ విశ్వవిద్యాలయంలో గెస్ట్ ప్రొఫెసర్‌గా (మధ్యయుగ భారతీయ చరిత్ర) చేరారు. ఆయన 1962లో మరణించారు. బెర్లిన్‌లోని 'సోషలిస్టుల స్మశానవాటిక'లో ఖననం చేయబడ్డారు.

## 13. రఫీ అహ్మద్ కిద్వాయ్ (1894-1954)

భారత స్వాతంత్ర్య ఉద్యమ కార్యకర్త, సోషలిస్ట్ అయిన రఫీ అహ్మద్ కిద్వాయ్ దేశాన్ని బ్రిటిష్ పాలన నుండి విముక్తి చేయడం కోసం పోరాడారు. MAO కళాశాల పట్టభద్రుడు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ తన గురువుగా భావించి అనేక సంస్కరణలను తీసుకురావడంలో, అన్యాయానికి వ్యతిరేకంగా అత్యంత దృఢ నిశ్చయంతో పోరాడడంలో రఫీ అహ్మద్ కిద్వాయ్ చేసిన ప్రయత్నాలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయి. రఫీ అహ్మద్ కిద్వాయ్ చివరి వరకు నిబద్ధత కలిగిన స్వాతంత్ర్య సమర యోధులు.

రఫీ అహ్మద్ కిద్వాయ్ ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. జైలు శిక్ష కూడా అనుభవించారు. 1922లో, రఫీ అహ్మద్ కిద్వాయ్ జైలు నుండి విడుదలైన తర్వాత మోతీలాల్ నెహ్రూకు ప్రైవేట్ కార్యదర్శిగా పనిచేశారు. 1926లో, రఫీ అహ్మద్ కిద్వాయ్ బ్రిటిష్ ఇండియా సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1926 నుండి 1929 వరకు కాంగ్రెస్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి చీఫ్ విప్‌గా పనిచేసారు. రఫీ అహ్మద్ కిద్వాయ్ యునైటెడ్ ప్రావిన్సెస్ కాంగ్రెస్ కమిటీకి కార్యదర్శి పదవిని కూడా నిర్వహించారు.

రఫీ అహ్మద్ కిద్వాయ్ సోషలిస్ట్ ఉద్యమంలో పాల్గొన్నారు. 1935లో యునైటెడ్ ప్రావిన్సెస్‌లో పండిట్ గోవింద్ వల్లభ్ పంత్ క్యాబినెట్‌లో రెవెన్యూ, జైలు శాఖలను నిర్వహించే బాధ్యతను నిర్వహించారు. రఫీ అహ్మద్ కిద్వాయ్ 1946లో యుపి హోం మంత్రి అయ్యారు.

స్వాతంత్ర్యం తర్వాత, జవహర్ లాల్ నెహ్రూ క్యాబినెట్‌లో రఫీ అహ్మద్ కిద్వాయ్ భారతదేశానికి మొదటి కమ్యూనికేషన్ మంత్రి అయ్యారు. అదే సంవత్సరంలో,ఆయన కమ్యూనికేషన్ల మంత్రిగా నైట్ ఎయిర్ మెయిల్ సేవను కూడా ప్రారంభించారు.

## 14. యాకూబ్ హసన్ (1875-1940)

యాకూబ్ హసన్ (మౌలానా యాకూబ్ హసన్) ఒక భారతీయ వ్యాపారవేత్త, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ నాయకులు, రాజాజీ (1937-1939) కింద మద్రాస్ ప్రెసిడెన్సీలో ప్రజా పనులకు క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. యాకూబ్ హసన్ 1916లో సౌత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. యాకూబ్ హసన్ INCలో చేరి 1919లో ఖిలాఫత్ ఆందోళనలో పాల్గొని ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు 1921లో మరోసారి జైలు శిక్ష అనుభవించారు.

1923లో యాకూబ్ హసన్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి మద్రాస్ ప్రావిన్స్ ముస్లిం లీగ్‌ను స్థాపించారు. 1937 ఎన్నికలకు ముందు, మద్రాస్ ప్రావిన్షియల్ ముస్లిం లీగ్‌ను విడిచిపెట్టి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో చేరారు. అతితక్కువ కాలంలో యాకూబ్ హసన్ మద్రాస్ ప్రావిన్షియల్ కాంగ్రెస్ అగ్ర నాయకులలో ఒకడు అయ్యారు. రెండు దేశాల సిద్ధాంతాన్ని ఖండించారు. ఐక్య భారత దేశానికి మద్దతు ఇచ్చారు.

## 15. షోయెబ్ ఖురేషి

గాంధీజీ నిర్బంధ సమయంలో షోయెబ్ ఖురేషి 'హరిజన్' పత్రికకు ఎడిటర్‌గా పనిచేసారు.


పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# బీసీ హక్కుల సాధనకు మరో పోరు తప్పదు

**-డా॥ ఖాలిద్ ముబష్షిరుజ్జఫర్, జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షులు**

**తెలంగాణ** వచ్చి పదకొండు సంవత్సరాలు గడిచిపోయినా, హక్కుల సాధన కోసం మరో ఉద్యమానికి పూనుకోవలసిన పరిస్థితులు తలెత్తాయని, బీసీ హక్కుల సాధనకు మరో పోరాటం చేయకతప్పదని జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షులు ఖాలిద్ ముబష్షిరుజ్జఫర్ అన్నారు. వరంగల్‌లో జరిగిన బీసీ రాజకీయ యుద్ధభేరీలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, కులగణన జరిపించి స్థానికసంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చెప్పారు.

వరంగల్ బీసీ రాజకీయ యుద్ధభేరి ధూం ధాంగా జరిగింది. ఈ సభలో రాజకీయ పార్టీల నేతలు, వివిధ ప్రజా సంఘాల లీడర్లు, పెద్ద సంఖ్యలో బీసీ ప్రముఖులు పాల్గొన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ తరపున ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఖాలిద్ ముబష్షిరుజ్జఫర్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఖాలిద్ జఫర్ మాట్లాడుతూ... తెలంగాణ కోసం జమాఅతె ఇస్లామీ హింద్ ప్రజాసంఘాలతో కలిసి పోరాడిందని చెప్పారు. ప్రత్యేక తెలంగాణ మలిదశ పోరులో న్యాయం కోసం తెలంగాణ, తెలంగాణ కోసం న్యాయం! అనే నినాదంతో జరిగిన పోరా టాన్ని, నిజాం కళాశాల గ్రౌండులో నిర్వహించిన తెలంగాణ గర్జనను గుర్తు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన ప్రయత్నాల గురించి వివరిస్తూ, నీళ్లు, నియామకాలు, విద్య, వైద్యం, ప్రభుత్వం... ఇలా అన్ని రంగాల్లో సమాన వాటా కావాలని తెలంగాణలోని ప్రతి ఒక్కరూ ఉద్యమించారని ఖాలిద్ అన్నారు. ముఖ్యంగా సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటంగా పేర్కొన్నారు. అన్ని వర్గాలకు సమానమైన హక్కులు, అవకాశాలు, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో ప్రాతినిధ్యం, విద్యా జీవన ప్రమాణాల మెరుగుదల కోసం జరిగిన పోరాటంగా చెబుతూ, కాని నేటి పరిస్థితి చూస్తే ఆవేదన కలుగుతుందని చెప్పారు. రాష్ట్రం ఏర్పడి పదకొండేళ్లు అయినా కానీ... సామాజిక న్యాయం లభించలేదని, హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాడక తప్పడం లేదని చెప్పారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, తెలంగాణను కార్పొరేట్ శక్తులకు అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాక ముందు, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీ వర్గాలకు వాగ్దానం చేసింది, కానీ హామీలను నెరవేర్చే విషయంలో మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు.

దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు చేయడం లేదని డాక్టర్ ఖాలిద్ ప్రశ్నిం చారు.

రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల పరిస్థితి దారుణంగా ఉంది, అక్కడ అధ్యాపకులు లేరు. బీసీ వర్గాలకు లెక్చరర్లు, ప్రొఫెసర్ల పదవులు దక్కడం లేదని ఆయన వాపోయారు. హాస్టళ్లలో ఆహారం, వసతి ఏర్పాట్లు రోజు రోజుకూ దిగజారిపోతున్నాయి. తాజాగా కాకతీయ యూనివర్సిటీలో జరిగిన ఘటనే దీనికి మంచి ఉదా హరణ అని డాక్టర్ ఖాలిద్ అన్నారు.

బీసీలు, సముదాయాలన్నీ అన్యాయానికి గురవుతున్నాయని, ఇందులో ముస్లిములు కూడా చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారని చెప్పారు. రాజకీయ పార్టీలు బీసీలను, ముస్లిములను ఓటు బ్యాంకులుగా వాడుకుని వదిలేస్తున్నాయని విమర్శించారు. రాజకీయాధికారంలో సమవాటా, బీసీలకు సామాజిక రాజకీయ న్యాయం కోసం గట్టిగా నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రస్తుత దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా బలమైన పోరాట వేదికను ఏర్పాటు చేయడానికి, సమాజంలోని వెనుకబడిన వర్గాలు ఒక వేదికపైకి రావడం చాలా ముఖ్యమని డాక్టర్ ఖాలిద్ అన్నారు. బీహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్, ఉత్తరప్రదేశ్‌లో అఖిలేష్ యాదవ్‌లు బీసీ రాజకీయాలకు కొత్త ఉరవడినిచ్చారని, తెలంగాణలో కూడా బీసీ రాజకీయాలు బలం పుంజుకునే ప్రయత్నాలు ఉధృతంగా జరగాలని పిలుపునిచ్చారు.

✤ ✤ ✤

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

37 ఆయత్‌లు

# 45. అల్ జాసియ

మక్కా అవతరణ

3-6 వాస్తవం ఏమిటంటే, ఆకాశాలలోనూ భూమిలోనూ అసంఖ్యాకమయిన సూచనలున్నాయి, విశ్వాసం గైకొనేవారికి. ఇంకా స్వయంగా మీ జననంలోనూ, అల్లాహ్ (భువిలో) వ్యాపింపజేస్తున్న జంతుజాలంలోనూ ఎన్నో సూచనలున్నాయి నమ్మకం పొందగోరే జనుల కొరకు.[3] ఇంకా రేయింబవళ్ళ వ్యత్యాసంలోనూ, భిన్నత్వంలోనూ,[4] అల్లాహ్ ఆకాశం నుండి అవతరింపజేసే ఉపాధి సామగ్రిలోను,[5] తద్వారానే మృతభూమిని బ్రతికించి లేపుతాడు,[6] మరి పవనాల పరిభ్రమణంలోనూ[7] – అనేక సూచనలున్నాయి, బుద్ధినుపయోగించే జనం కొరకు. ఇవన్నీ అల్లాహ్ సూచనలు, వీటిని మేము నీ సమక్షంలో సరిగ్గా, సవ్యంగా వివరిస్తున్నాము. ఇంతకూ ఇక అల్లాహ్, ఆయన సూచనల తరువాత ఇంకా మరే విషయం కావాలి ఈ జనులు విశ్వసించడానికి.[8]

---

3. అంటే, ఎవరయితే తిరస్కరించాలనే నిర్ణయించుకున్నారో, లేదా ఎవరయితే అనుమానం, ఆశంకల చక్రబంధంలో దారి తప్పి తిరగడాన్నే తమకు ఇష్టమని ఎన్నుకున్నారో, వారి వ్యవహారమయితే వేరు. కాని ఎవరి హృదయ కవాటాలయితే విశ్వాసానికి మూసుకుపోలేదో వారు తమ పుట్టుకను, తమ శరీర నిర్మాణాన్ని, భువిలో వ్యాపించివున్న రకరకాల జంతు రాశిని పరిశీలనా దృష్టితో గమనించినట్లయితే వారికి అసంఖ్యాకమయిన సూచనలు కానవస్తాయి. వాటిని చూసి, బహుశా ఇదంతా ఏ దైవమూ లేకుండానే ఉనికిలోకి వచ్చిందని లేదా దీనంతటి సృజనలో ఒక దైవాన్ని మించి అనేక దైవాల ప్రమేయముందని అనుమానమయినా కలిగే అవకాశం లేదు. (వివరణకు చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం, సం.2, అల్ అన్‌ఆమ్: పాద సూచికలు 25-27 సం.4, అన్ నహ్ల్: పాద సూచికలు 7 -9, సం.5, అల్ హజ్ : పాద సూచికలు 5 – 9 అల్ మూ'మినూన్ : 12, 13 అల్ ఫుర్కాన్ : పాద సూచి 69 అష్ షు'అరా: పాద సూచికలు 57, 58 సం.6, అస్ సజ్దా : పాద సూచికలు 16 – 18 సం.7, యాసీన్: ఆయత్‌లు 71-73, అజ్ జుమర్: ఆయత్ 6, అల్ మూ'మిన్: పాద సూచికలు 97, 98, 110).

4. రేయింబవళ్ళ ఈ వ్యత్యాసం, ఈ భిన్నత్వం రెండూ అత్యంత క్రమబద్ధంగా ఒకదాని తరువాత మరొకటి వస్తాయన్న విషయమూ సూచనే, ఇంకా ఒకటి ప్రకాశమానమయినది, మరొకటి తిమిరమయమయినది అన్న విషయమూ సూచనే; ఇంకా ఒక నిర్ణీత కాలం వరకు క్రమేణ పగలు చిన్నదిగాను, రేయి పెద్దదిగానూ రూపొందుతూ పోతుంది, తరువాత ఒక సమయాన రెండూ సమానమయిపోతాయి. తిరిగి క్రమేణ పగలు పెద్దదిగాను, రేయి చిన్నదిగానూ మారుతూ పోతాయి, మళ్ళీ ఒక సమయాన రెండూ సమానమయిపోతాయి – ఇది దీని రీత్యా కూడా సూచనే. రేయింబవళ్ళలో ఉన్న ఈ విభిన్నమయిన వ్యత్యాసాలు, వైరుధ్యాలు, వీటిలో ఇమిడి ఉన్న మహోన్నతమయిన విజ్ఞతా ఔచిత్యాలు స్పష్టంగా సూచిస్తున్నదేమిటంటే సూర్యుడు, భూమి, భూమిలో ఉనికి పొందిన వాటినన్నింటి సృష్టికర్త ఒక్కడే. ఈ రెండు మండలాలను ఒకే బలవత్తర అధికార శక్తి అదుపులో నియంత్రించి పెట్టింది. అదేదో చెవిటి, గుడ్డి, అవివేక అధికార శక్తి కాదు. అదొక అత్యంత విజ్ఞతా పూర్వకమయిన అధికారం, అది తిరుగులేని లెక్క కట్టి తాను పుట్టించిన వృక్షరాశి, జంతుజాలం, మానవజాతివంటి అసంఖ్యాకమయిన ప్రాణులు మనగలగటానికి తన భూమిని అనుకూలమయిన స్థలంగా రూపొందించింది. (వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.3, యూనుస్: పాదసూచిక 65, సం.5, అన్ నహ్ల్: పాదసూచి 104, సం.6, అల్ కసస్: ఆయత్‌లు 71, 72 లుక్మాన్: ఆయత్ 29, పాద సూచిక 50; సం.7, యాసీన్: ఆయత్ 37, పాదసూచి 32).

5. ఉపాధి సామగ్రి అంటే ఇక్కడ ఉద్దేశం వర్షం; తరువాతి వాక్యం వల్ల ఇది స్పష్టంగా ద్యోతకమవుతోంది.

6. వివరణకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.5, అల్ మూ'మినూన్ : పాదసూచి 17, అల్ ఫుర్కాన్: పాద సూచికలు 62-65 అష్ షు'అరా: పాదసూచి 5 అన్ నహ్ల్: పాదసూచికలు 73, 74 సం.6, అర్ రూమ్: పాద సూచికలు 35,73 సం.7, యాసీన్: పాదసూచికలు 26-31.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## హునైన్ యుద్ధం గురించి

**185)** హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి) కథనం: మేము హునైన్ యుద్ధం నుండి తిరిగి వస్తుండగా, ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి, తాను అజ్ఞాన కాలంలో ఉండగా ఏతెకాఫ్ పాటిస్తానని మొక్కుకున్నట్లు చెప్పారు. దానికి దైవప్రవక్త(స), "మొక్కుబడిని తీర్చుకో" అని ఆదేశించారు.

**186)** అబూ ఖతాదా(రజి) వివరించారు: హునైన్ యుద్ధం కొరకు మేము ప్రవక్త మహనీయులు(సఅసమ్)తో కలసి బయలుదేరాము. యుద్ధం మొదలైనప్పుడు ముస్లింలు తడబడ్డారు. ఆ సమయంలో ఒక బహుదైవారాధకుడు ఒక ముస్లింపై ఆధిపత్యం వహించటాన్ని నేను గమనించి, వెనుక నుంచి వెళ్ళి అతని మెడపై ఒక్క ఖడ్గపు వ్రేటు వేశాను. అతని కవచాన్ని కోసివేశాను. అంతే, అతను నా వైపు తిరిగి అమాంతం నాపై లంఘించాడు. ఆ క్షణంలో మృత్యువు నా కళ్ళ ముందే కదలాడినట్లు అనిపించింది. కడకు అతను మరణించడంతో, నాకు అతని బెడద తప్పింది. తరువాత ఉమర్(రజి) నాకు తారసపడ్డారు. 'ఇంతకీ జనులకేమై పోయింది?' అని నేను ఆయన్ని అడిగాను. 'బహుశా దైవాదేశం ఇదేనేమో!' అన్నారాయన.

తరువాత ముస్లింలు తిరగబడ్డారు. (యుద్ధం ముగిసిన తరువాత) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఉపవిష్టులై "ఎవరయినా యుద్ధంలో ప్రత్యర్థిని చంపి ఉంటే, అతను దానికి సంబంధించిన సాక్ష్యాధారం కూడా కలిగి ఉంటే, దానిని సమర్పించాలి. అప్పుడు హతుని సంపత్తి, ఆయుధాలు అతనికి ఇవ్వబడతాయి" అని సెలవిచ్చారు. మరైతే నా వ్యవహారంలో సాక్ష్యమిచ్చేవారెవరు? అని మనసులో అనుకుని, నిశ్శబ్దంగా కూర్చుండిపోయాను. దైవప్రవక్త(స) రెండవసారి కూడా అదేవిధంగా సూచించారు. రెండవసారి కూడా నేను మనసులో అలాగే అనుకుని, కూర్చుండిపోయాను. దైవప్రవక్త(స) ఇంకొకసారి కూడా ఆదేశించడంతో నేను లేచి నిలబడ్డాను. "అబూ ఖతాదా! ఏమిటి సంగతి?" అని అడిగారు ప్రవక్త మహనీయులు(స). నేను ఆయన(స)కు జరిగినదంతా వివరించి చెప్పాను. అప్పుడు ఒక వ్యక్తి (అస్వద్ బిన్ ఖుజాయి అస్లమీ) జోక్యం చేసుకుని, 'ఈయనగారు చెప్పేది నిజం. ఆ హతుని సంపత్తి నా దగ్గర ఉంది. అది నాకు దక్కేలా తమరు ఈయన గారిని ఒప్పించండి' అని విన్నవించుకున్నారు. అప్పుడు అబూబకర్(రజి) కల్పించుకుని, 'లేదు. దైవసాక్షిగా అలా జరగనేరదు. దైవ కిశోరాలలోని ఒక యువ కిశోరం దైవం, దైవప్రవక్త తరఫున పోరాడినప్పుడు దైవప్రవక్త(స) అతనికి చెందవలసిన హక్కును నీకివ్వటమా? అలా జరగదు' అని పలికారు. అప్పుడు ప్రవక్త మహనీయులు(స), "(అబూబకర్) నిజం చెప్పారు. నీవు ఆ సంపత్తిని అబూ ఖతాదాకు ఇచ్చేయ్" అని ఆదేశించారు.

ఆయన ఆ సంపత్తిని నాకు ఇచ్చేశారు. దాంతో నేను సలమా తెగవారి వాడలో ఒక తోటను కొన్నాను. ఇస్లామ్ స్వీకరించిన పిదప నాకు లభించిన తొలి సంపద అది.

# అంతర్జాతీయ కుట్రలు-ముస్లిం జగత్తు



అనువాదం - కె.ఎం.ఎ. సుబ్‌హాన్

**(సయ్యద్ సాదతుల్లా హుసైనీ పుస్తకం "ఇఖామతె దీన్ కీ షాహ్‌రాహ్" నుంచి....)**

**నేడు ముస్లింలకు** తమ చరిత్రలోనే అత్యంత కఠినమైన పరిస్థితులు ఎదురై వున్నాయి. ఈ విషయంగా ఎటువంటి అనుమానాలకు తావే లేదు. నిస్సందేహంగా కొన్ని చిన్న ప్రాంతాలు మినహా దాదాపు ఇస్లామీయ ప్రపంచం మొత్తం బానిసలుగా జీవించిన కాలం కూడా దాపురించిన సందర్భం ఉండింది. నేడు కూడా కేవలం నామమాత్రపు స్వేచ్ఛ అనుభవిస్తూ వున్నా, ముస్లిం ప్రజానీకం అవమానాలకు పరాభవాలకు, నిస్సహాయతలకు, నిస్పృహలకు, దిగజారిన హృదయానికి గురైవుంది. సుమారు ఒకటిన్నర బిలియన్ ముస్లిం ప్రజానీకపు ఉషోదయం, దౌర్జ న్యాలు, అవమానాల, పరాభవాలతో ప్రారంభమవుతుంది. ఇటు వంటి దురదృష్టకర స్థితి బహుశా గత చరిత్రలో మనకు కనపడదు. నేడు మొత్తం ఇస్లాం జగత్తు అంతర్జాతీయ శక్తుల దౌర్జన్యాలకు కుట్రల చదరంగానికి కేంద్రమై ఉంది. ఇస్లామీయ ప్రాంతాలలో మానవ రక్తం, నీళ్ళలాగా పారుతోంది. ఇస్లామీయ ఉద్యమాలు నేడు తమ చరిత్రలోనే అత్యంత కఠినమైన పరిస్థితు లను ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ ఆధిపత్య శక్తులే కాకుండా, ముస్లిం పేర్లు తగిలించుకున్న దేశాలు సైతం, ఇస్లామీయ ఉద్యమాలను అణచివేసేందుకు సమైక్యంగా కలిసి తమ పూర్తి శక్తిని వినియోగిస్తున్నాయి. మీడియా, ఇంటర్నెట్, పరిశోధనల విస్తృతమైన సంస్థలు, ఇస్లామీయ ఉద్యమాన్ని విమర్శించేందుకు, వారిని ప్రజా వ్యతిరేకులుగా ముద్ర వేసేం దుకు, వారిని ప్రధాన ప్రజాస్రవంతి నుండి వేరు పర్చేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నాయి. ఇస్లామీయ వ్యవస్థ, ఇస్లామీయ పునాది విలువలు, సూత్రాలు, విశ్వాసాలు కూడా వీరి నీచమైన వ్యతిరేక ప్రాపగండాలలో ఉన్నాయి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో, ఈ విషయంపై రెండు విధాలుగా మనం ఆలోచించవలసి ఉంటుంది. ఒకటి ఈ పరిస్థితులకు కారణం ఏమిటి? రెండవది ఈ పరిస్థితులను ఓడించి, విజయ వంతంగా ముందుకు సాగే రాజమార్గం ఏది?

## ముస్లిం జగత్తు ప్రాధాన్యత అందుకు కారణాలు :

అంతర్జాతీయ శక్తులలో ముస్లిం జగత్తుకు అత్యంత ప్రాధాన్యత ఉందనేది జగమెరిగిన సత్యమే. ఇందుకు ప్రధానమైన నాలుగు కారణాలున్నాయి. తూర్పు దేశాలలోని చమురునిక్షేపాలు, ఇజ్రాయిల్ దేశం ఉనికిలోనికి రావడం, దాని సంక్షేమానికి కృషి, ఈ ప్రాంతం భౌగోళికంగా కలిగివున్న ప్రాధాన్యత, ఈ ప్రాంతంలోనే ఇస్లాం తన కేంద్రాన్ని కలిగి ఉండటం, ఈ నాలుగు ప్రధాన అంశాలతో అంతర్జాతీయ ఆధిపత్య శక్తులకు, అమెరికా, యూరప్‌ల లోతైన రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ప్రయోజనాలు ముడిపడి వున్నాయి.

యూరప్ అత్యంత తీవ్రగతిన వృద్ధాప్యానికి చేరువ అవుతూ ఉంది. ప్రస్తుతం యూరప్‌లోని ప్రతి ఐదుగురిలో ఒకరి వయసు 65 సంవత్సరాలు దాటి ఉంది. (An Aging Europe in

Dicline, in Newyork Times, Author C. Brooks) యూరప్ ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి దానికి యువరక్తం అవసరమై ఉంది. ఈ యువరక్తపు అవసరాన్ని కేవలం ఇస్లామీయ జగత్తు మాత్రమే తీర్చగలుగుతుంది. అయితే, యూరప్ ఈ యువ వేడి నెత్తురు ద్వారా లబ్ధిపొందాలంటే ఈ యువరక్తంతో పాటు ఇస్లాంను కూడా స్వాగతించవలసి ఉంటుంది. యూరప్ ఈ యువరక్తపు రాకడను ఆపలేక, వారి ద్వారా వచ్చే ఇస్లాంను నిరోధించలేక సతమతమవుతూ ఉంది. ఇందుకు పరిష్కారంగా ఒక పాలసీని యూరప్ అమలు చేసేందుకు సిద్ధమైంది. అది ముస్లిం జగత్తు యువరక్తాన్ని ఆహ్వానించాలి. అదే సమయంలో వారిని ఇస్లామీయ విలువలకు విశ్వాసాలకు దూరంగా ఉంచాలి. వారి ప్రభావం యూరోపియన్ ప్రపంచంపై పడకుండా జాగ్రత్త వహించాలి.

ఇదే విధంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్రగతిలో చైనా రుణ ప్రభావానికి లోనౌతూ ఉంది. ఈ ఆర్థిక దాస్యం నుండి బయట పడేందుకు అమెరికా, చైనాను అధిగమించేందుకు ప్రయత్నించడం తప్పనిసరి అయ్యింది. ఇందుకు తూర్పు అరబ్బుదేశాల చమురు నిక్షేపాలపై, చమురు ఉత్పత్తి కర్మాగారాలపై కంట్రోలు సాధించడం తప్పనిసరి అయ్యింది. చైనా, నకిలీ ఉత్పత్తులను తన ప్రధాన ఆదాయవనరుగా చేసుకొని ఉంది. తూర్పు దేశాల మార్కెట్ మొత్తాన్ని చైనా ఆక్రమించి ఉంది. ఈ ఆక్రమణను తొలగించి అమెరికా ఆధిపత్యం స్థాపించబడాలని అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తూ ఉంది. ఇది ఇజ్రాయిల్ దేశ రక్షణకు కూడా అమెరికాకు అవసరమై ఉంది.

ఇంకా అనేక కారణాల వల్ల పశ్చిమ మధ్య ప్రాంతం (అరబ్బు ప్రాంతం) ముస్లింల స్థావరాలపై అంతర్జాతీయ ఆధిపత్య శక్తులు తమ సీతకన్ను వేసి వున్నాయి. ఇతర శక్తులను ఈ ప్రాంతం వైపుకు రాకుండా నిరోధించేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నాయి. డాలర్లను విసిరి ఈ ప్రాంతాన్ని నియంత్రించడం రోజురోజుకూ కష్టమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. మధ్య పశ్చిమ ప్రాంతాన్ని తమ నియంత్రణలో ఉంచుకోవడం ప్రస్తుత ఆధిపత్య శక్తులకు చాలా కష్టమయ్యే పరిస్థితి నేడు నెలకొని ఉంది. మొదటి ప్రపంచ యుద్ధం అనంతరం విజయులైన శక్తులు, ఈ మధ్య పశ్చిమ, ముస్లిం జగత్తును తమకు అనుకూలంగా విభజించుకొని భౌగోళిక రూపురేఖలనే తమకు అనుకూలంగా మార్చివేశాయి. ప్రస్తుతం మరోసారి ఈ విభజనను మార్చి మరింతగా తమకు అనుకూలంగా మార్చే కుట్రలకు పూనుకున్నాయి. అందుకు అంతర్గత యుద్ధాలను సృష్టించాయి. అంతులేని రక్తపాతాలకు, మానవ హననాలకు పాల్పడుతున్నాయి. ఇది మొత్తంగా అభివృద్ధి మంత్రం పేరుతో Costructive Chaosగా పిలవబడుతూ ఉంది. ఈ కుట్రల పాలసీల ఫలితంగా మధ్య పశ్చిమ అరబ్బు ముస్లిం జగత్తు మొత్తం రక్తపాతంలో మునిగి తేలాలని ఈ శక్తులు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. (The Politics of Chaos in the Middle East,Columbia Press, 2009, By Oliver Roy - Translated by Schwart2) పేర్కొన్న ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యతలు ఒకవైపున ఉన్నాయి. కాని, సదరు మధ్య ప్రాచ్యంలోని ఇస్లాం, అసలు కారణంగా ఉందనేది మనం అర్థం చేసుకోవాలి. ఇబ్లీస్ శక్తులు (షైతానీ శక్తులు), తమకు అత్యంత ప్రమాదకరంగా ఇస్లాంను భావిస్తున్నాయి. ఇస్లాం కేంద్రంగా ఈ ప్రాంతమే విరాజిల్లింది.

ఈ ఆధిపత్య శక్తులు ఇస్లాంను తమకు ప్రమాదంగా భావించేందుకు మరో కోణం–ఇస్లాం నేటి ప్రపంచ సమస్యలకు మరీ ప్రత్యేకించి పశ్చిమ దేశాల సమస్యలకు పరిష్కారం చూపే శక్తి కలిగి ఉండటమే. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించిన విధ్వంసానికి, ఇస్లాం ప్రత్యామ్నాయం చూపించగలుగుతుంది. ప్రత్యామ్నాయ జీవన వ్యవస్థగా నిలువగలుగుతుంది.

ప్రస్తుత పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి భవిష్యత్తు లేదని రూఢీ అయిపోయింది. ఈ ఆర్థిక పెట్టుబడిదారీ సామ్రాజ్యం, తన పునాదులను సైతం కోల్పోయింది. తన తాత్వికత, సైద్ధాంతికతల అపజయాలను చవిచూస్తూ ఉంది. తన ప్రభావం, పద్ధతులన్నీ ఇప్పుడు మునుగుతున్న ఓడలా మారిపోయింది. భౌతిక, పదార్థ పూజతో నేడు యూరప్ విసిగిపోయింది. దీనిని వదిలించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తూ ఉంది. ధార్మికత, ఆధ్యాత్మికత, వాటి విలువల వైపునకు మరలుతుంది. దీనిని పశ్చిమ దేశాల రచయితలు DESECULARIZATION అని పిలుస్తున్నారు. ఈ ఆధ్యాత్మిక భావనల ప్రవాహం వేగంగానే ప్రవహిస్తూ ఉంది. (Shall the Religious inherit the world; Demography and Politics in Twenty First Century Profile books; London; 2011 by Eric Kanf mann)

వ్యక్తి సంస్కార,
సంఘ నిర్మాణ,
నైతిక పథకం
గీటురాయి
వారపత్రిక

2

# ఇస్లామీయ ఉద్యమ లక్ష్యం

# సద్పరివర్తనం

- ఎస్.ఎమ్. మలిక్

### పథకబద్ధమయిన కృషి

ఇస్లామీయ ఉద్యమం నిలిపిన నాల్గవ, చివరి ప్రాతిపదిక ఈ ధర్మ సంస్థాపనా కృషి, ఒక సుసంఘటిత, పటిష్ట, పథకబద్ధ, నిరంతర కృషి ద్వారా కొనసాగాలన్నది. ఈ విధంగా ఈ కృషి ఒక సమగ్రమయిన, సర్వతోముఖమయిన వ్యవస్థ అవసరాన్ని సూచిస్తుంది. భిన్నభిన్నంగా కొందరు వ్యక్తులు కొన్ని రంగాలలో వీలయినంతగా ఏదో చేసి కూర్చోవడమో లేదా కొన్ని నెలల్లో, కొన్ని సంవత్సరాలలో కష్టపడి, అలసిపోయి, ఇక వీలు కాదని, నిరాశా నిస్పృహలకు లోనయిపోవడమో లేదా ఓ వ్యక్తి లేదా ఓ వర్గం, తాము తలచుకున్నదేదో, తాము అనుకున్న విధానాన కృషించి, చేతులుడిగి పడిపోవడమో జరిగితే ఎటువంటి ఫలమూ దక్కదు. ఈ మహత్కార్యాన్ని నిర్వర్తించేందుకు అందరూ కలసి, ఒక సుస్థిర వ్యవస్థను నెలకొలిపి, సమగ్ర పథక రచన చేసి దాన్ని నిరంతరంగా అమలుపరచినప్పుడే ఈ లోకంలో ఏదయినా సాధించ వీలవుతుంది, ధర్మ సంస్థాపనం అయితే మరీను.

### ఇదీ విప్లవం

ఇస్లామీయ ఉద్యమం ఈ భావనలు, ఈ సిద్ధాంతాల ఆధారం గానే ఉనికిలోకి వచ్చింది, ఈ మార్గానే అది గత డెబ్బయి అయిదు, ఎనభయి సంవత్సరాలుగా నిరంతర కృషిలో నిమగ్నమయి ఉంది. ఆచరణాత్మకంగా అది కోరుకునే విషయం ఏమిటీ, దాని లక్ష్యంలో ఉన్న ఆ విప్లవం, పరివర్తన, పెనుమార్పు ఏమిటీ? ఆ విప్లవ సందేశం ఏమిటీ? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఒక్క వాక్యంలో చెప్పాలంటే అది- ఇస్లామీయ ఉద్యమ సందేశం, దైవదాస్య సందేశం. అది మనిషిని, ఒకే దైవం తప్ప మరే ప్రకృతికి అతీతమయిన వ్యక్తిత్వాన్నీ సేవించ రాదు. మరే, దైవ సృష్టితాన్ని లేదా మానవుణ్ణి, లేదా తన మనోకాంక్షల దాస్యాన్నీ పాటించరాదు. మనిషిని చుట్టుముట్టి బంధించిన దాస్య శృంఖలాలన్నింటినీ త్రెంచివేసి మనిషిని స్వతంత్రుణ్ణిగా, కేవలం తన కర్త, స్వామి, ప్రభువు, పాలకుడు అయిన దైవానికి దాసునిగా చేసి వదలాలని కోరుకుంటుంది.

ఈ విప్లవ సందేశం మౌలిక అంశం ద్వారా రెండు తప్పనిసరి ఉపశీర్షికలు, రెండు వేర్వేరు అంశాలుగా ముందుకు వస్తాయి. ఒకటి, ఈ దైవ దాస్యానికి లక్ష్యం ఏది? ఇస్లామీయ విప్లవ సందేశం ప్రకారం, జీవితం ఓ నిరంతరం సాగే అనంతమయిన ప్రక్రియ. ఇహలోక జీవన క్రమానుగతి, ఈ ప్రపంచం దాటిన తరువాత మరో లోకం, పరలోకంలో కొనసాగుతుంది, అక్కడి జీవితం అక్షయమయినది, ఎల్లకాలాల వరకూ సాగుతుంది. ఈ లోక జీవితంలో మనిషి ఏది చేసినా దాని పర్యవసానాలు ఆ పరలోక జీవితంలో బయల్పడతాయి. ఆ అనంతమయిన పరలోక జీవితాన్ని ఆనందమయం, శాంతిపూర్వకం చేసుకునేం దుకు మనిషి ఇహలోక జీవితంలో కృషించవలసి ఉంటుంది. ఇదే దైవదాస్య భావనకు తప్పనిసరి అంశం, ఇస్లామీయ విప్లవ సందేశానికి రెండవ అంశం.

ఈ సందేశానికి మూడవ అంశం, దైవదాస్యానికి తప్పనిసరి రెండవ అంశం. పైన పేర్కొన్న పరలోక జీవితాన్ని ఆనందభరితం చేసుకునే దారి ఏది? అన్నది. ఇదే దైవ దాస్యానికి సరయిన

అసలు మార్గం. దీనిద్వారానే పరలోక జీవితమూ ఇహలోక జీవితమూ, ఉభయత్రా నెమ్మదితో నిండిపోతుంది, సుఖ మయంగా గడుస్తుంది. దీన్నే ఇస్లామీయ జీవన వ్యవస్థ అని అంటారు. మానవుడు ఇహలోకంలో చేయవలసిందల్లా ఈ జీవన వ్యవస్థ పరిధిలోనే చేయవలసి ఉంటుంది! ఈ జీవన వ్యవస్థ మనిషి వ్యక్తిగత, సామూహిక రెండు రంగాలనూ ఆవరించి ఉంది. ఈ వ్యవస్థ ద్వారానే వ్యక్తిగత స్థాయిలోనూ సామూహిక స్థాయిలోనూ ఆచరించడం ద్వారానే పరలోకంలోని అనంత జీవితం సఫలమవుతుంది, దీని ద్వారానే పరలోకంలో నెమ్మది ప్రాప్తిస్తుంది.

ఇస్లామీయ విప్లవ సందేశానికి సంబంధించిన ఈ మూడు అంశాలు మౌలికమయినవి. పైన వచ్చిన వివరాలను బట్టి ఒక విషయం విశదమయిపోయింది. ఇస్లామీయ జీవన వ్యవస్థకు సంబంధించిన సమస్త చర్చ, పరలోక సాఫల్యం, దాని ఆనందం, దాని సవ్యత చుట్టూనే పరిభ్రమిస్తూ ఉంటుంది. దీన్నిబట్టి వాస్తవానికి ఇస్లామీయ పరివర్తన, విప్లవం సమస్తం ఈ పరలోక సాఫల్యానికి సోపానం తప్ప మరేమీ కాదు. ఇస్లామీయ ఉద్యమం ఉద్దేశించిన విప్లవం, పరివర్తనం, పెనుమార్పుకు కేంద్రం, మూలం కూడా పరలోక సాఫల్యమే!

## ఉద్యమ కార్యకర్తలు

ఇహలోకంలో ఇస్లామీ ఉద్యమం ఉద్దేశించిన సద్పరివర్తనం సాధించడానికి దాని కార్యకర్తల్లో, ఇస్లామీయ విప్లవాన్ని పరిపూర్ణంగా నెలకొల్పేందుకు కావలసిన శక్తి సామర్థ్యాలూ, లక్షణాలు ఎలాగూ అవసరమే. వాటితోపాటు మరో ముఖ్య విషయం ప్రస్ఫుటం కావడం కూడా అవసరం. వలసిన శక్తిసామర్థ్యాలు, లక్షణాలతోపాటు వారిలో పరలోక సాఫల్య కాంక్ష కూడా ప్రముఖంగా అవసరం. పరలోక సాఫల్య కాంక్ష వల్ల మనిషిలో ఉత్పన్నమయ్యే సల్లక్షణాలు బయల్పడటం తప్పనిసరి. ఎందుకంటే ఈ యావత్తు కృషికి అసలు మూలం, దాని బృహర్థమని, పరలోక సాఫల్య విశ్వాసమే! ఆ సఫలత ప్రాప్తం కాకపోతే ఈ కృషి అంతా ఆయా వ్యక్తులకు సంబంధించినంత వరకు వ్యర్థమే కదా. ఎన్ని శక్తిసామర్థ్యాలున్నా, పరలోక సాఫల్య కాంక్ష వల్ల జనించే సదాచార సంపన్నత ఒక్కటి లేకపోతే, ఉద్యమం కోరుకునే సద్పరివర్తన నెలకొన్నప్పటికీ ప్రయోజనం ఏమిటీ? నేలపైన సద్పరివర్తన నెలకొన్నా అసలు మూలం, మానవ సాఫల్యం ప్రాప్తం కాకపోతే మనుషుల అనంత పరలోక జీవితం దృష్ట్యా అది నిష్ప్రయోజనమే! దీని ప్రకారం ఇస్లామీ విప్లవానికి కేంద్ర బిందువయిన మనిషి పరలోక సాఫల్యమే అసలు మూలాంకురం. ఇది ప్రాప్తం కావాలంటే ప్రతి వ్యక్తిలో అనివార్యంగా ఇస్లామీయ సద్గుణాలూ జనించాలి, పరలోక సాఫల్య కాంక్ష కూడా తీవ్రంగా, మెండుగా ఉండాలి!

## జమాఅతె ఇస్లామీ హింద్ కడప అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



స్థానిక బెల్లంమండిలోని మదరస–యే–జెహ్రాలో జమాఅతె ఇస్లామి హింద్ కడప శాఖ ఆధ్వర్యంలో ఉచిత మల్టీ స్పెషాలిటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని శ్రీ టి. నరసింహ మూర్తి (ప్రెసిడెంట్, ది కడప డిస్ట్రిక్ట్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, కడప) ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమాత్ సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. మరొక అతిథి జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి జనాబ్ అక్బర్ బాషా మాట్లాడుతూ జమాత్ చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ శిబిరంలో డా॥ యు.రామమనోహర్ M.S., (Ortho), డా॥ షహనా బేగం (M.B.B.S., D.G.O), డా॥ ఎస్. ఖదీరున్నిసా బేగం M.B.B.S., D.G.O, డా॥ సాజిద్ బాషా M.D. (Paediatrics), డా॥ షేక్ మస్రూర్ అహ్మద్ M.B.B.S., M.D. (Skin & VD), డా॥ షేక్ జావీద్ బాషా M.B.B.S., M.E.M. వైద్య శిబిరంలో పాల్గొని ఉచితంగా వైద్య సేవలను అందించారు. చికిత్స తర్వాత అవసరమైన వాళ్లకి ఉచితంగా మందులు అందించారు. అదనంగా అవసరమైన వారికి S.A.R DIAGNOSTICS CENTER వారి సహకారంతో ఉచితంగా షుగర్ టెస్ట్ సేవలను అందించారు. జమాత్ నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారనీ సంస్థ స్థానిక అధ్యక్షులు జనాబ్ జాకీర్ హుసేన్ గారు తెలిపారు.

# హమారా సంవిధాన్... హమారా స్వాభిమాన్




- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**(గత సంచిక తరువాయి)**

భారత రాజ్యాంగం కేవలం పరిపాలనకు సంబంధించిన నియమాలు, సూత్రాల సమాహారం కాదు. స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాలు మూల స్తంభాలుగా- అన్ని విధాలా ప్రజల అభివృద్ధిని కోరుకునే సమున్నత ఆశయం. 75సంవత్సరాలుగా సామాజిక, ఆర్థిక, లింగ భేదాలకు అతీతంగా- దేశ ప్రజల జీవితాల్ని ప్రభావితం చేస్తూనే ఉంది. పేద, ధనిక అని తేడా లేకుండా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకుంటున్నా, భావప్రకటన స్వేచ్ఛను ఆస్వాదిస్తున్నా, తమకు ఇష్టం వచ్చిన ధర్మాన్ని పాటిస్తున్నా అది రాజ్యాంగ చలవే. ప్రపంచంలో ఎక్కడా లేనన్ని భాషలు, సంప్రదాయాలు... భిన్న మతాలు, వేల కులాలున్నా... దేశ విభజన, అల్లకల్లోల పరిస్థితులు, అస్తవ్యస్త ఆర్థిక స్థితిగతులు... చైనా, పాక్‌లతో ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాలు, ఎమర్జెన్సీ లాంటి కరకు నిర్ణయాలు... ఈశాన్య రాష్ట్రాలు, పంజాబ్, కశ్మీర్లలో పెచ్చరిల్లిన ఉగ్రవాదం... ఇలా విదేశీ శత్రువులు, స్వదేశీ సంక్షోభాలు ఎన్ని ఎదురైనా... భారతావనిలో ప్రజాస్వామ్యం నిలబడటం కాదు బలపడింది. కారణం... మన రాజ్యాంగం! జాతిగా నిలిపి... దేశంగా కలిపి ఉంచుతున్న రక్షాబంధం మన రాజ్యాంగం! అందుకే మన సంవిధానం.. మన స్వాభిమానం!!

ఏడు దశాబ్దాల క్రితం రూపొందించిన ఆ రాజ్యాంగ ప్రతి-ఈ రోజుకు కూడా ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు, పౌరులకు నిత్యనూతనంగా ఉపయోగపడుతున్నది. మౌలిక సూత్రాలయిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వాల కోసం వెన్నుదన్నుగా నిలిచి-ప్రభుత్వానికి ఆదేశిక సూత్రాలను, దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడడంలో, సాధారణ పౌరులకు వారి ప్రాథమిక బాధ్యతలను గుర్తు చేయడంలో మన రాజ్యాంగం- యావద్భారత సమాజానికి దారిదీపంగా నిలిచింది.

భారతదేశంలో 140 కోట్ల మందిలో సుమారు 50 కోట్ల మంది యువకులే ఉండటం మనకు గర్వకారణం. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, విద్యా రంగాల్లో వీరి సేవలు పొందాల్సిన బాధ్యత కూడా కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల చేతిలో ఉంది. కానీ పాలక వర్గాలు యువత మీద దృష్టి పెట్టకుండా ఆశ్రితులైన వారికి ఎక్కువగా ఆర్థిక వెసులుబాటును కల్పిస్తూ యువత శక్తిని, సామర్థ్యాన్ని, ప్రతిభను, నైపుణ్యాన్ని, నవ్యతను దెబ్బ తీస్తున్నాయి. హక్కులు లేని పౌరసత్వం బానిసత్వంతో సమానం. ప్రజాస్వామ్యం అన్నాక హక్కులుండాలి. ఆ హక్కులకు బలమైన భరోసా అందాలి. మధ్యయుగాల్లో... దోచుకున్నవాడిదే సొత్తు. గెలుచుకున్న వాడిదే భూమి. నిలదీస్తే నాలుక తెగేది. ప్రశ్నిస్తే శాల్తీ మాయమై పోయేది. ఇప్పటికీ కొన్ని దేశాల్లో ప్రజల ఆస్తులకు రక్షణ లేదు. ఈ విషయంలో భారతీయులు అదృష్టవంతులు. సాక్షాత్తూ రాజ్యాంగమే కష్టార్జితానికి భరోసా ఇచ్చింది. ఒకప్పుడు రాజ్యంలో రాజే చట్టం. రాజు మాటే శిలాశాసనం. మరిప్పుడో!! చట్టమే రాజు. చట్టమే ప్రభుత్వం. మరి అలాంటి మహోన్నత చట్టాన్ని కొందరు చుట్టంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తే అది ఎంత ప్రమాదానికి దారి తీయగలదో కుమతులకు అర్థం కాకపోయినా, సుమతులు అర్థం చేసుకోగలరు. మంచి మార్పుకి శ్రీకారం చుట్టగలరు.

స్వాతంత్ర్యం అంటే స్వేచ్ఛను కలిగి ఉండటం మాత్రమే కాదు, దేశం పట్ల బాధ్యతగా మెలగడం కూడా ఉన్నది. హక్కులు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. నీకు రావాల్సింది నువ్వెలా తీసుకోవాలో చెబుతాయి. బాధ్యతలు హుందాతనాన్ని బోధిస్తాయి. సమాజానికి నువ్వేం ఇవ్వాలో చెబుతాయి. ఈ యదార్థం కొందరికి పట్టినా, ఇంకొందరు పట్టించుకున్నా, అధిక శాతం మంది ఏదీ పట్టనట్టే ఉన్నారు. ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతకడానికే తీరిక ఉండటం లేదు. అలాంటిది దేశం గురించి ఏం ఆలోచిస్తాం అనుకుని ఐదేళ్ళకోసారి ఎవరో ఒకరికి గద్దెని అప్పగించి బ్రతుకుని షరా మామూలుగా నెట్టుకొచ్చేస్తున్నాము.

"భిన్న ప్రాంతాల, భాషల, మతాల, సంస్కృతుల భారతీయ ప్రజానీకాన్ని ఏకం చేయడమే అసలైన సవాలు.. దేశంలో ఐక్యతా భావం వెల్లివిరిసేలా ఒకరితో ఒకరు సామరస్యంగా ఉంటూ ఐక్యతా భావంతో నిర్ణయాలు తీసుకునేలా ఎలా ప్రేరేపించాలన్నది ఆలోచించాలి" అని అంబేద్కర్ అన్నారు. ఆనాడూ ఈనాడూ భిన్నత్వంలో ఏకత్వమే భారత్‌ని నిర్వచించే అసలైన శక్తి. వైవిధ్యాన్ని మనం స్వాగతిద్దాం. శ్లాఘిద్దాం. ఆ వైవిధ్యాన్ని స్వీకరించడంలోనే దేశ పురోగతి దాగుంది. భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని వేడుక చేసుకోవడం మన జీవితాల్లో అంతర్భాగమవ్వాలి. అదే బాబా సాహెబ్ అంబేద్కర్‌కు మనమందించగల నిజమైన నివాళి అవుతుంది.

ఒకవైపు బ్లాక్ మార్కెట్, మనీ ల్యాండరింగ్ వంటివి దేశాన్ని వాణిజ్యపరంగా దెబ్బతీస్తూ వుంటే, మరోప్రక్క కులం - మతం, భాషలను ఉపయోగించి ప్రజల మధ్య ద్వేషాన్ని పెంచి పోషిస్తు న్నారు. అసాంఘిక జ్వాలలను ఎగదోస్తూ ఆ కాష్ఠంలో చలి కాచుకుంటున్నారు.

**అంతిమంగా....**

మన కంటే పెద్దవారంటే గౌరవముండాలి, మన వయస్సు వాళ్లతో స్నేహంగా ఉంటూనే ఆరోగ్యవంతమైన పోటీ ఉండాలి, మన కంటే చిన్న వాళ్ళ పట్ల ప్రేమ, కరుణ కలిగి ఉండాలి. మన ఈ కట్టుబాటు భాష, ప్రాంతం, మతం, జాతి అన్న అడ్డు కట్టల్ని తెంచుకున్న నాడు మానవత్వం గర్వంతో శిరసెత్తుకొని పరవశిస్తుంది. వాడిదైన రోజున ఎవడైనా కొట్టగలడు. అసలు గొడవ రాకుండా ఆపుతాడు చూడు.. వాడు గొప్పోడు అన్నారు పెద్దలు. ఒక దేహానికి ఉంటే కోరిక. అదే కోరిక దేశానికి ఉంటే ఉద్యమం, విప్లవం. మనం ఇష్టంగా అనుకునేది అదృష్టం, బలంగా కోరుకునేది భవిష్యత్తు. సత్సమాజ నిర్మాణమే నీ ధ్యేయం, సకల జనుల సౌభాగ్యమే నీ లక్ష్యం. ఏకదీక్షతో గమ్యం చేరిననాడే.. లోకానికి మన భారతదేశం అందించునులే శుభసంకేతం..అని శ్రీశ్రీ అన్న మాట మనందరి అస్త్రం, శస్త్రం అవ్వాలి.

ఒక్కొక్క బిందువల్లె జనులనొక్కచోట చేర్చి సముద్రమల్లె మార్చినారు మన స్వాతంత్ర్య సమర యోధులు. ప్రపంచమే వణికిపోయే పెను తుఫానులాగ వీచి ఆంగ్ల పాలనను ధిక్కరించినారు మన జాతి రత్నాలు. ఓ కవి చెప్పినట్టు శ్వాసలోన దేశమే మన గుండె ఘోష లోన దేశమే . దేశమంటేనే మీరు... మనమంటేనే దేశం! జై హింద్!


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

కథ

- షహనాజ్‌బేగం, అనంతపురం



# మానవత్వం గెలిచింది

**అమ్జద్‌**కు చాలా కాలం తరువాత తన ఊరికి వెళ్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. తన స్నేహితులను కలవబోతున్నందుకు మహా ఆనందపడిపోతున్నాడు. తన బాల్యమిత్రులు, తన సహ విద్యార్థులయిన భార్గవ్‌, మోహన్‌, నయీమ్‌లు ఒకచోట కల్సుకున్నారంటే తమ వయసులు కూడా మరిచిపోయి చిన్న పిల్లల్లా అల్లరి చేసుకుంటూ ఆనందంగా గడపడం రివాజు. ఒకే ఊరికి చెందినవాళ్ళు కావటం చేత చాలా దగ్గరితనంతో, అరమరికలు లేకుండా మసలుకునేవాళ్ళు. అమ్జద్‌ వాళ్ళింట్లో రమజాన్‌ ఈద్‌నాడు వాళ్ళందరూ వచ్చి తన తల్లి చేసిన షీర్‌ఖుర్మాను తెగ మెచ్చుకుంటూ ఆరగించేవాళ్ళు. ఇఫ్తార్‌ పార్టీలు జరుపుకునేవాళ్ళు. అంతేకాదు వారి బంధువర్గంలో ఇఫ్తార్‌ పార్టీలు జరిగినా తన మిత్రులను వెంటబెట్టుకుని వెళ్ళేవారు.

ఆ ఊరిలో గల కాలేజీలో చదువు పూర్తి కావడంతో, అమ్జద్‌కు హైదరాబాద్‌లో ఉద్యోగం రావటంతో అక్కడికి చేరుకున్నాడు. అతని వివాహం కూడా అక్కడి అమ్మాయితోనే జరగడంతో అతను హైదరాబాద్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది.

మిగతా వాళ్ళందరూ అక్కడే ఏవో వ్యాపారాలు చేసుకుంటూ ఊళ్లోనే ఉండిపోయారు. ఏ సెలవు రోజుల్లోనో, ఏ పండక్కో ఆ ఊరికి చేరుకున్నప్పుడు అందరూ ఒకచోట కల్సుకుని ఆనందంగా గడుపుకునేవాళ్ళు.

ఇంకా అతను హైదరాబాద్‌ నుండి వస్తున్నట్లు తెలియగానే అప్పుడే తామందరూ ఎక్కడ, ఎప్పుడు కల్సుకోవాలో, ఎలా ఎంజాయ్‌ చేయాలో ప్లాన్‌ చేసుకునేవాళ్ళు. అతను ఊరు చేరేవరకు ఫోన్‌ల మీద ఫోన్లు తెగ చేసేవారు. ఊరు ఎప్పుడు చేరుతున్నావు అంటూ.

అతని మిత్రులు హైదరాబాద్‌ నగరానికి వచ్చినప్పుడు కూడా అంతే. అందరూ కల్సి బాగా ఎంజాయ్‌ చేసేవాళ్ళు. ఆ ఏర్పాట్లన్నీ అమ్జద్‌ చేసేవాడు.

కానీ కొంతకాలంగా భార్గవ్‌లోనూ, మోహన్‌లోనూ ఏదో మార్పు కన్పిస్తోంది. మునుపటిలా ఆత్మీయతను, స్నేహాన్ని చూపించటం లేదు. వారి మాటల్లోనూ, ప్రవర్తనలోనూ ఏదో గూఢార్థం, మరేదో ప్రేమ రాహిత్యం గోచరిస్తోంది.

అమ్జద్‌ తాను వస్తున్నట్లు సమాచారం అందించినా ఇదివరకటిలా ఆనందంగా గాని, ఉత్సాహంగానీ వ్యక్తపర్చలేదు. ఏదో మొక్కుబడిలా పొడిపొడిగా మాట్లాడటం గమనించాడు.

అంతేకాక అడపాదడపా తన ఫోన్‌లో అర్థంపర్థంలేని మెసేజ్‌లు పెట్టడం, అతని మనసుని ఆందోళనపర్చింది. ఒకసారి ఆ మిత్రులిద్దరూ హైదరాబాద్‌ వచ్చి కూడా అతనిని కలవకుండానే వెళ్ళిపోవటం అతనిని మరింత కలవరపర్చింది.

భార్గవ్‌, మోహన్‌ వంటి స్నేహితులేకాక మరికొంతమంది ఏదో పార్టీలవారితో కలిసి తిరుగుతున్నట్లు వారి సిద్ధాంతాలను, అభిప్రాయాలను, ఆలోచనలను అలవర్చుకున్నట్లు తెలిసింది.

చాలాకాలం తర్వాత మా ఊరిలో ఏదో పనిబడటం, మా తల్లిగారు కూడా రమజాన్‌ మాసం దగ్గర పడ్తున్నది, ఓ నెల రోజులు సెలవు పెట్టేసి వచ్చెయి.... అని కోరితే అమ్జద్‌ నెలరోజుల పాటు సెలవు పెట్టేసి కుటుంబ సమేతంగా ఊరు చేరుకున్నాడు.

అమ్జద్ ఊరు చేరగానే తన మిత్రులందరికీ తన రాకని తెలియ పర్చినా వారి నుండి ఎలాంటి స్పందనలు లేకపోవటంతో ఒకపక్క ఆశ్చర్యం, మరో పక్క ఏదో తెలియని బాధ కలిగాయి. తమకు ఏవో పనులు తగిలాయని తప్పించుకుని తిరిగారు.

అతను విన్నది నిజమే. వాళ్ళంతా ఏదో పార్టీలో చేరి ఏవో కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

మొన్నటివరకు మనమంతా ఒక్కటే అన్న భావనలో మసలుకున్న వాళ్ళలో ఈ తరతమ బేధభావాలు ఏమిటి. ఆనాటి స్నేహభావాలు అంతరించిపోయాయి. వాళ్ళల్లో ఏవో వ్యతిరేక భావనలు కన్పించ సాగాయి. అది తెల్సుకుని బాధతో కుమిలిపోయాడు. అప్పటికీ అతను వారితో మునుపటిలా స్నేహ హస్తాన్ని అందిస్తూ సహజ సిద్ధమైన ధోరణిలోనే వ్యవహరిస్తున్నాడు.

స్వతహగా భార్గవ్ మంచివాడే. కానీ ఎవరో అతనిలో విషపూరిత విద్వేషాన్ని రగిల్చి అతని మనసును మార్చారు. తమ మధ్య ఏవో అంతరాలు, అగాథాలు సృష్టించబడ్డాయని గ్రహించాడు.

రోజులు గడిచిపోతున్నాయి...

నెలవంకను చూసి ఇంటిల్లిపాది ఎంతో ఆనందించారు. రోజాలు, ఇఫ్తార్‌లు మొదలయ్యాయి.

ఒకరోజు భార్గవ్‌ను మిగతా మిత్రులను ఇఫ్తార్ దావత్‌కు ఆహ్వానిద్దామని బయలుదేరారు. మిత్రులు ఎప్పుడూ కల్సుకునే చోట ఉన్నారంటే అక్కడికి వెళ్ళాడు అమ్జద్. అతని రాకను గమనించి కూడా గమనించనట్లు వ్యవహరించాడు భార్గవ్. తరువాత తన మాటలతో, చేతలతో అమ్జద్‌ని అవమానించ సాగాడు. అమ్జద్ వేషధారణ గురించి వారి అలవాట్ల గురించి హేళనగా, ఎగతాళిగా మాట్లాడటం ప్రారంభించాడు. అప్పటికీ అన్నీ సహిస్తూ భరిస్తూ కూర్చున్నాడు. తరువాత అతని వైఖరి నచ్చక, బహుశ అతని మూడ్ బాగా లేదేమోననుకుంటూ అక్కడినుంచి లేచి వచ్చేశాడు.

తన ఇంటికి ఇఫ్తార్ విందుకు రమ్మని పిలవటానికి వెళ్ళాడు. కానీ అతను ఆ అవకాశమే ఇవ్వలేదు. ఆ దైవమే అతనిలోని చెడు లక్షణాలను, భావాలను రూపుమాపాలని మనసులో వేడుకున్నాను.

రోజులు నిరాసక్తంగా గడిచిపోతున్నాయి. ఏదో తెలియని అభద్రతా భావం కూడా లోలోన మెలిపెడుతోంది. తన ఊరికి వచ్చానన్న ఆనందం గానీ, ఉత్సాహం గానీ ఇప్పుడు లేవు. ఒక దశలో సెలవు క్యాన్సిల్ చేసుకుని తిరిగి వెళ్ళిపోదామా అనుకున్నాడు. కానీ ఇంట్లో అందరూ ఎంతో భక్తితో పవిత్ర మాసాన్ని గడుపు తున్నారు.

కానీ అనుకోకుండా ఆ రోజు ఒక విపత్కర పరిస్థితి ఎదుర య్యింది. ఓ రాత్రివేళ ఫోన్ మ్రోగింది. ఫోన్ లిఫ్ట్ చెయ్యబోతే అక్కడ భార్గవ్ పేరు కన్పించింది. ఆశ్చర్యపోతూ ఫోన్ లిఫ్ట్ చేద్దామా వద్దా అనుకుంటూ సంశయపడ్తూ మెల్లిగా హాలో అన్నాడు. అవతల భార్గవ్ కంగారు కంగారుగా దాదాపు ఏడుస్తూ 'అమ్జద్ ఎక్కడున్నావు. తొందరగా రా. నా కొడుకు సందీప్‌పై దాడి జరుగు తోంది. నా కొడుకుని చంపేస్తున్నారు. నువ్వు తప్ప ఎవరూ రక్షించ లేరు. నువ్వే దిక్కు' అంటున్నాడు.

"ఎవరు దాడి చేస్తున్నారు? ఎక్కడ జరుగుతోంది? ఎందుకు జరుగు తోంది? ఇంకా అడిగే లోపు 'తరువాత విషయం చెబుతాను. టైమ్ లేదు. ముందు అక్కడికి వెళ్లు. నా బిడ్డను రక్షించురా.... గట్టిగా అరిచినట్లు అర్థించారు.

అమ్జద్ గబగబా తన వాళ్ళను వెంటబెట్టుకుని భార్గవ్ చెప్పిన ప్రదేశానికి చేరుకున్నాడు. ముందూ వెనుకా ఆలోచించకుండా.

నిజమే. అక్కడ కొంతమంది వ్యక్తులు సందీప్‌ను కర్రలతో నిర్దయగా కొడుతున్నారు. కొంత సమయం ఆలస్యమైతే అతని ప్రాణాలు పోయేవి. అమ్జద్ ముందూ వెనుకా ఆలోచించక ఒక్కసారిగా వారిపై కలియబడ్డాడు. అడ్డం వచ్చినవాళ్ళను చితక్కొట్టాడు. కొంతసేపు వాళ్ళ మధ్య యుద్ధం లాంటిది జరిగింది. అవతలి వాళ్ళు అమ్జద్‌ను, అతని వెంట వచ్చిన వాళ్ళను చూసి వెనక్కి తగ్గారు. తరువాత సందీప్ వంక కోపంతో చూస్తూ వెళ్ళిపోయారు.

తరువాత రక్తం ఓడుతున్న శరీరంతో తెలివి తప్పి పడిపోయిన సందీప్‌ను తన భుజాలపై మోసుకుని వెళ్ళి తనకు తెలిసిన డాక్టర్‌చేత వైద్యం చేయించాడు అమ్జద్.

తరువాత తెలిసిందేమిటంటే- అదేదో ప్రేమ వ్యవహరమట. అతను ఇష్టపడిన అమ్మాయి తరపు వారు ఉన్నత కుటుంబీకు లట. అంతేకాదు, భార్గవ్ ఎవరి పంచన చేరి కార్యకలాపాలు నడుపుతున్నాడో ఆ నాయకుడి కూతురట. అప్పటికీ ఒకసారి భార్గవ్‌ను పిల్చి బెదిరించి భయపెట్టి పంపించాడట ఆ నాయకుడు. కానీ ఆ కుర్రాడు పెద్దలు మాటలు వినక హద్దులు దాటాడట. పర్యవసానంగా ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. అమ్జద్ సరైన సమయానికి వెళ్ళి అతని ప్రాణాలు రక్షించాడు.

"అమ్జద్ నన్ను క్షమించమని అడగటానికి కూడా నాకు అర్హత లేదు. మిత్రమా ఆ ఆపద సమయంలో నా వాళ్ళెవరూ నాకు

**మిగతా 30వ పేజీలో...**




# రాజ్యాంగం @ 75 సవాళ్లు

డా.మహ్మద్ హసన్, అసిస్టెంట్ ప్రొఫెసర్

**పరాయి** పాలనలో ఉన్న దేశానికి సుధీర్ఘమైన పోరాటం తర్వాత 1947 ఆగష్టు 15 న దేశానికి స్వాతంత్ర్యము సిద్ధించిన విషయం మనందరికీ తెలిసినదే. దేశానికి స్వాతంత్ర్యమైతే వచ్చింది, కానీ అప్పటికే అంతర్గతంగా వున్న సమస్యలు, బ్రిటిష్ వారు వెళ్తూ, వెళ్తూ అసంపూర్ణంగా వదిలివెళ్ళిన సరిహద్దు సమస్యలు ఇలా ఒకటేమిటి కొత్తగా ఏర్పడిన నెహ్రూ ప్రభుత్వంపైన అనేక సవాళ్ళు, సంక్షోభాలు ప్రశ్నలై సంధించటం మొదలుపెట్టాయి. ఆ సమయంలో మనదేశానికి కావాల్సిన పాలనాపరమైన ఓ నిర్మాణాత్మమైన, క్రియాశీలమైన "రాజ్యాంగం" (Constitution) అవసరం. అలా డా.బీఆర్ అంబేద్కర్ ముసాయిదా కమిటి చైర్మన్‌గా, డా॥బాబురాజేంద్ర ప్రసాద్ అధ్యక్షులుగా వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, పరిశోధించి 2 సం.రాల 11 నెలల 18 రోజులపాటు శ్రమించి మన దేశానికి కావాల్సిన రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26 నాడు ఆమోదించటం జరిగింది. నాటి రాజ్యాంగంలో 395 ప్రకరణలు, 8 షెడ్యూళ్ళు, 22 భాగాలు వున్నాయి, (ప్రస్తుతం 12 షెడ్యూళ్ళు 25 భాగాలు 486 పైగా అధికరణలు) అప్పట్లోనే దీనికి సుమారు 64 లక్షల రూపాయల వ్యయం అయినట్లుగా చెప్తారు. 1950 జనవరి 26 నాడు అధికారికంగా అమల్లోకి వచ్చింది. అంటే 2025 జనవరి 26 నాటికి రాజ్యాంగం అమలు లోకి వచ్చి 75 సం.రాలు (ప్లాటినం జూబ్లి) పూర్తి చేసుకున్నాం.

ఈ 75 సంవత్సరాల కాలంలో దేశం పరిపాలనా పరంగా, జనాభా పరంగా, సంస్థాగతంగా, సాంకేతికంగా చాలా ప్రగతి సాధించిందని మాత్రం చెప్పగలం కానీ ఆ మార్పు అన్ని రంగాల్లో ఆశించిన స్థాయిలో రాజ్యాంగంలో పొందుపర్చిన విధంగా క్షేత్రస్థాయిలో అమలు జరగలేదనేది బహిరంగ రహస్యమే. అంతెందుకు రాజ్యాంగ ప్రవేశికలో లేని "సామ్యవాద, లౌకిక" పదాలను 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976లో శ్రీమతి ఇందిరాగాంధి ప్రధాన మంత్రిగా వున్న కాలంలో సవరణ చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం కానీ స్వాతంత్ర్యనంతరం కానీ వేల సంవత్సరాలుగా "భిన్నత్వంలో ఏకత్వం" అనే భావనతో భారతీయులందరు సోదర భావంతో ఒకే గొడుకు క్రింద నివసిసున్నారు. మరి ఈ భావన రాజ్యాంగం రచిస్తున్న ఆ కాలంలో నాడు వారికి ఎందుకు స్ఫురించలేదన్నది ప్రశ్న? అంటే జరిగిన పొరపాటును గుర్తించడానికి మరో పాతిక సంవత్సరాలు పట్టిందన్న మాట. కానీ నేడు "సామ్యవాద, లౌకిక"

పదాలపై ఇటీవలే తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్య స్వామి సుప్రీం కోర్టులో కేసు వేసి ఆ పదాలను తొలగించాలని కోరిన విషయం, ఆ కేసును కోర్టు కొట్టివేసిన విషయం కూడా మనందరికీ తెలిసినదే. అలాగే 1976లో స్వర్ణ సింగ్ కమిటి సిఫార్సుల మేరకు ప్రాథమిక విధులను (పూర్వపు సోవియట్ యూనియన్ నుండి స్వీకరించి) చేర్చడం జరిగింది. ఇవి కూడా నాడు రాజ్యాంగ రచనా బృందంలో వున్న సభ్యులకు ఎందుకు స్ఫురించలేదన్నది ప్రశ్న? ఈ డెబ్బై ఐదు సంవత్సరాల కాలంలో నేటికి 106 సవరణలు జరిగాయి. అంతెందుకు రాజ్యాంగం అమలులోకి వచ్చిన సంవత్సర కాలంలోనే (1951) మొదటి సవరణ ద్వారా భూ సంస్కరణలు, తొమ్మిదొవ షెడ్యూల్‌లో చేర్చడం జరిగింది. చట్ట సభలలో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించడం ఇలా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగంలో సవరణలు జరుగుతూనే వున్నాయ్, ఇకముందూ జరుగుతాయ్ కూడా.

### రాజ్యాంగం ఎదుర్కొంటున్న మరికొన్ని సవాళ్ళు

ఏ దేశ రాజ్యాంగం ఐనా మారుతున్న అవసరాలకు అనుగుణంగా తన స్వరూపాన్ని మార్చుకుంటుంది, ఆనాడు రాజ్యాంగ సభలో డా.బి.ఆర్.అంబేద్కర్ గారే స్వయంగా “ఒకవేళ రాజ్యాంగం విఫలం ఐతే ఆ తప్పు రాజ్యాంగానిది కాదు దానిని అమలు చేసే పాలకులదే” అని ప్రకటించటం కొసమెరుపు. కాబట్టి దాని అమలు బాధ్యతను పాలకులే సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకొనివెళ్ళాలి, రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు దేశ జనాభా 28 కోట్లు (అక్షరాస్యత 14%) నేడు 140 కోట్లకు పైగా జనాభా, అక్షరాస్యత మాత్రం నేటికి 90% చేరలేదు అంటే ఎక్కడ మనం విఫలం అవుతున్నామో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో ప్రజలందరూ సంక్షేమ ఫలాలు ఎందుకు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారో ఓసారి సమీక్ష చేసుకోవాల్సిన సందర్భం కూడా.

1985లో చేసిన పార్టీ పిరాయింపుల నిరోధక చట్టం పదో షెడ్యూల్‌లో చేర్చటం జరిగింది, (52వ సవరణ) ఇది నేటికీ ఏ విధంగా అమలు అవుతున్నదో దీనిని రాజకీయ పార్టీలు ఎలా దుర్వినియోగం చేస్తున్నాయో అందరికి తెలిసిన విషయమే. ఇక విద్యా హక్కు చట్టం (2002 86వ సవరణ) ద్వారా 6-14 సం.రాల బాల బాలికలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలనేది దీని సంకల్పం. మరి నేటికీ బడి బయట లక్షల మంది పిల్లలు వున్నారంటే ఈ చట్టం ఎలా అమలవుతున్నదో ఈ పాటికే అర్థం అయి ఉండొచ్చు. ఈ డెబ్బై ఐదు సంవత్సరాల కాలంలో దేశ అక్షరాస్యత శాతం 75% లోపు వుందంటే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. ఇంక స్త్రీల అక్షరాస్యత శాతం గురించి చెప్పాలంటే ఇంకింత ఆశ్చర్యం వేస్తుంది. ఇలా చెప్పుకుంటూపోతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణపూరిత వాతావరణం, అంతరాష్ట్ర వివాదాలు, న్యాయ సమీక్ష అధికారం, రాష్ట్రపతి పాలన (356వ నిబంధన దుర్వినియోగం) ఉమ్మడి పౌరస్మృతి (44వ నిబంధన) రిజర్వేషన్లు, ఎన్నికల ప్రక్రియ మొదలైనవి. (ప్రస్తుతం ఒకే దేశం ఒకే ఎన్నిక (జమిలి ఎన్నికలు)పై రామ్‌నాథ్ కోవింద్ కమిటి అనుకూలంగా కేంద్రానికి నివేదిక సమర్పించింది). అలాగే కొలీజియం వ్యవస్థ, దేశంలో అంతర్గతంగా పెరుగుతున్న “కులం, మతం” మొదలైన విద్వేషపు భావజాలం, (ఈ మధ్యనే ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజా నివేదికలో మత విద్వేషం బుసలు కొడుతున్న దేశాల్లో మనదేశం వుందని సంచలన విషయాలు వెల్లడించింది) ఈ డెబ్బై ఐదు సం.రాల కాలంలో రాజ్యాంగంలో పొందుపర్చిన “కులం- మతం” భావనలు అక్షరాస్యత పెరిగినకొద్దీ తగ్గాలి కాని పెరగటం ఏంటనేది మనల్ని మనం ఆలోచించుకోవాల్సిన ప్రశ్న?. ఇది పాలకుల వైఫల్యమా? ప్రజల వైఫల్యమా? అన్నది తర్కించుకోవాలి. అలాగే “ఎలక్టోరల్ బాండ్స్” వివిధ పథకాల ద్వారా లబ్దిపొందిన వ్యాపారవేత్తలు తిరిగి రాజకీయ పార్టీలకు చందాల రూపంలో చెల్లించడం అనేది కూడా వివాదాస్పదమైన అంశమే. అలాగే ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి కల్గినప్పటికి దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతున్నాయా! అనేది కూడా ప్రశ్నే?. ఓటరుకు అనేక రకాల తాయిలాలు ఇచ్చి అధికారం కైవసం (Power Politics) చేసుకోవాలని ప్రతీ పార్టీ ప్రయత్నం చేయటం కూడా మనం గమనించవచ్చు. ఓటరు అవినీతికి అలవాటు పడ్డప్పుడు పాలకుడు సత్య హరిశ్చంద్రుడెలా అవుతాడనేది ప్రశ్న?. నేనైతే 1950-70వ దశకంలో జరిగిన ఎన్నికలే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలతో పోల్చితే పారదర్శకంగా జరిగినట్లుగా భావిస్తాను.

రాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశ సూత్రాలు కాని, ప్రాథమిక హక్కులలో పొందుపర్చిన భావ ప్రకటన స్వేచ్ఛ (ఆర్టికల్ -19) అలాగే అంటరానితనం నిషేధం (నిబంధన- 17) విధించినప్పటికీ నేటికీ ఆ వివక్ష కొనసాగుతూనే వుండటం అనేది రాజ్యాంగం ముందున్న అతి పెద్ద సవాలుగా భావించాలి, అదేవిధంగా రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రాథమిక విధులలో వన్యప్రాణుల సంరక్షణ చట్టం (1972), అడవుల సంరక్షణ చట్టం (1980) మొదలైనవి కాగితాల మీద మాత్రమే వున్నాయి తప్ప ఆచరణాత్మకంగా అందరూ దీనికి కట్టుబడి అమలు చేయడం

లేదనేది వాస్తవమే. 1950 నాటి దేశ అటవీ విస్తీర్ణం ఎంత? ఇప్పుడు ఎంత? ఎందుకు తగ్గిందనేది ప్రశ్నించుకోవాలి.

ఇలా చెప్పుకుంటూపోతే ఈ అంశంపై పెద్ద సిద్ధాంత గ్రంథమే ఏ యూనివర్సిటీకైన సమర్పించవచ్చును. కాలం మారుతున్న కొద్దీ ఆలోచనా విధానంలోను, పాలనా విషయాలలోను మార్పులను స్వీకరించాల్సిందే. కానీ అవి ఎంతమేరకు క్షేత్రస్థాయిలో అమలు జరుగుతున్నాయనేది కూడా పరిశీలించి వాటిని సక్రమంగా అమలు చెయ్యాల్సిన బాధ్యత కూడా పాలకులదే. చట్టసభలకు ఎన్నికౌతున్న ప్రజాప్రతినిధులలో 90% మంది ఏదో ఒక నేరంతో ప్రమేయం ఉన్నట్లు ఇటీవలే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రకటించింది. అంటే చట్టాలు ఎవరు చేస్తున్నారో గమనించవచ్చు. "రాజ్యాంగం" మీద కనీస అవగాహన లేనివారు చట్టసభలలో అడుగుపెట్టడం బాధకల్గించే అంశం కాకపోతే ఏమిటి? ఒక అందమైన భవంతిని నిర్మించుకొని దానిని సక్రమంగా వాడుకోక పోతే అది త్వరలోనే శిథిలస్థితికి చేరుతుంది. ఈ సూత్రం ఏ దేశ రాజ్యాంగానికైనా వర్తిస్తుంది. "భారత ప్రజలమైన మనం మన దేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర్య రాజ్యవ్యవస్థగా నిర్మించేందుకు పవిత్ర దీక్షతో తీర్మానించి మనదేశ పౌరులందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావ ప్రకటన స్వేచ్ఛ, మతవిశ్వాస ఆరాధనా స్వేచ్ఛను, అవకాశాల్లోను సమానత్వాన్ని సాధించేందుకు వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యతను, సమగ్రతను సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు శాసనం (రాజ్యాంగం రూపంలో) చేసి ఆమోదించి మాకు మేము సమర్పించు కుంటున్నాం". అని రాజ్యాంగ ప్రవేశికలోనే ఉంది. అంటే ఆనాడు మన లక్ష్యాలు, ఆశయాలకు అనుగుణంగానే అది రూపొందించబడింది. దీనిని బట్టి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగానికి ఎదురయ్యే సవాళ్ళను పరిష్కరించు కోవడానికి ఆనాడే అవకాశం కల్పించబడింది. రాజ్యాంగం కల్పించిన అవకాశాలు ఇంకా కొద్దిమందికి చేరలేదు. ఎన్ని పరిమితులు ఉన్నప్పటికీ రాజ్యాంగం గత ఏడు దశాబ్దాల స్వతంత్ర్య భారత దేశంలో ఘనవిజయాలు సాధించింది. రాజ్యాంగంలో పేర్కొన్న విలువలు మన నిత్య జీవితంలో పాటించే విలువల మూలంగానే మన రాజ్యాంగం పాక్షికంగా విజయం సాధించడానికి కారణం. రాజ్యాంగం మనకేమిచ్చింది అనే ప్రశ్న కన్నా రాజ్యాంగంలో వున్న వాటిని మనం ఏ మేరకు అమలు చేస్తున్నాం అనేది కూడా ప్రశ్నే? రాజ్యాంగం హక్కులను, విధులను, స్వేచ్ఛను ఉన్నతమైన అవకాశాలను కల్పించింది, ఇంతకుమించి ఏం కావాలి. రాజ్యాంగ ఫలాలు పొంది మళ్ళీ కొద్దిమంది ప్రశ్నించటం ఏంటనేది కూడా ఆలోచించాల్సిన విషయం. అంతిమంగా పాలకులలో పారదర్శకమైన పాలన అందివ్వాలనే "సంకల్పం" ఉంటే, ప్రజలకు "జవాబుదారితనం" కూడా ఉండాలి. అప్పుడే ఆ రాజ్యాంగం పరిపాలనా నిర్వహణలో విజయం సాధించినట్లుగా భావించాలి.

27వ పేజీ తరువాయి...

## మానవత్వం గెలిచింది

గుర్తుకురాలేదు. నీవు తప్ప. స్వార్థపరుల అండ చూసుకుని నీ వంటి ప్రాణ స్నేహితుల్ని పోగొట్టుకున్నాను. ఈనాడు నువ్వు నీ ప్రాణాలనుసైతం లెక్క చెయ్యకుండా నా బిడ్డను కాపాడావు. నా అనే వాళ్ళెవరూ ముందుకు రాలేదు. ఎవరివో చెప్పుడు మాటలు విని ఆ సంస్థలో చేరి విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి ఇన్నాళ్ళు మానవత్వాన్ని, సోదర భావాన్ని మరిచాను. వాళ్ళంతా మమ్మల్ని వారి స్వార్థానికి వాడుకుని వదిలేశారు. అందుకే మా బ్రతుకులు ఇలా అయ్యాయి" అంటూ దుఃఖించసాగాడు భార్గవ్.

అమ్జద్ అతనిని ఓదార్చసాగాడు.

'ఊరుకో మిత్రమా. ఇప్పటికయినా యధార్థమేమిటో తెల్సుకున్నావు. అది చాలు. సమాజంలో మానవత్వం అనేది ఉండాలి. మనిషికి మనిషికి మధ్య సోదరభావంతోపాటు ఆప్యాయతలు, అనురాగాలు, అనుబంధాలు కలిగి ఉండాలి. కొంతమంది ఉన్మాదులు చేసే దుశ్చర్యల వల్ల సమాజం అల్లకల్లోలమైపోతుంది. అయినా మనమందరం సహనంతో అన్నింటిని ఎదుర్కొందాము. మనం ఐక్యతను పాటిస్తే ఎదుటివాడు మనల్ని ఏం చెయ్యలేడు" అంటూ అతనిని శాంతింపజేశాడు.

"ఇంకా శాంతం, సహనం అంటావేమిటి? నీకెలాంటి కోపావేశాలు కలగటం లేదా? ఆశ్చర్యంగా అడిగాడు భార్గవ్.

★ ★ ★

ఆ రోజు రమజాన్ ఈద్. అమ్జద్ ఇంట్లో ఆనందం వెల్లివిరిస్తోంది. అమ్జద్ స్నేహితులు భార్గవ్, మోహన్‌లు కుటుంబ సమేతంగా వచ్చి ఉన్నారు. వాళ్ళంతా అమ్జద్ తల్లి, కుటుంబసభ్యులు తయారు చేసిన షీర్‌ఖుర్మా తదితర వంటకాలను ఆనందంగా ఆరగించసాగారు.

అదొక ఆనందం, ఆప్యాయతల సంగమంగా అగుపించింది.



# పదవీ విరమణ

**- యం.ఏ ఆరిఫ్, కొత్తగూడెం**

**ఉద్యోగం**లో పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక గొప్ప మైలురాయి అని చెప్పవచ్చు. పదవీ విరమణ అనేది వృత్తి నుండి వైదొలగడం. పదవి విరమణ అంటే ఒక మజిలీ ముగిసింది అని అర్థం. కానీ పదవీ విరమణ తర్వాత మన జీవితాన్ని ఎలా ఎదుర్కొవాలనేది చాలా మందికి ఎదురయ్యే ప్రశ్న. ఉద్యోగంలో పదవి విరమణ అయ్యాక తమకు వచ్చే పెన్షన్ తింటూ కాలక్షేపం చేయడం కాదు. పదవీ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమే, జీవితానికి కాదు.

పదవి విరమణ తర్వాత మీ జీవితాన్ని ఎలా గడుపుతున్నారు. ఉద్యోగంలో (పదవిలో) ఉన్నప్పుడు పని తప్ప వేరే ధ్యాస ఉండదు, అయిన వాళ్ళు, బంధువులు గుర్తుకు రారు కదా! భార్య పిల్లలను కూడా పట్టించుకోరు. మంచి,చెడు పలకరింపు ఉండదు. శుభ కార్యాలకు వెళ్ళరు. ఆఖరికి బంధువులు చనిపోయినా డ్యూటీ ఉండడం వల్ల రాలేకపోయాను అంటారు.

### ఎంత సంపాదించినా తీరని ఆత్రం మనిషిది

60 సంవత్సరాల వయస్సు వరకు పనిచేసి, కుటుంబాన్ని పోషించడంలోనే సగం జీవితం అయిపోతుంది.

తన గురించి, తన ఆరోగ్యం గురించి కూడా ఆలోచించడు. పదవి విరమణ అయ్యేటప్పుడు ఉద్వేగానికి లోనై, రేపటినుండి నేను ఉద్యోగానికి వెళ్ళనవసరం లేదు అని తెలిసి కన్నీటి పర్యంతం అవుతాడు. మనిషికి ఇహలోకం, పరలోకం అని రెండు జీవితాలు ఉంటాయి.

ఇహలోకం అంటే ప్రాపంచిక జీవితం, పరలోకం అంటే మరణానంతర జీవితం. అదేవిధంగా ఉద్యోగం అనేది మొదటి దశ అయితే, పదవీ విరమణ అనేది జీవితంలో రెండో దశ. మరి పదవి విరమణ తర్వాత జీవితం ఎలా గడపాలి? అనేది తెలుసు కుందాం! మొదటగా పదవి విరమణ వయసు వరకు ఏ ఆపద రాకుండా, ఆరోగ్యంగా ఉంచిన ఆ దైవానికి కృతజ్ఞతలు తెలపాలి. ఎలాగో ఉద్యోగంలో ఉన్నప్పుడు బంధువులను కలిసే అవకాశం ఉండేది కాదు. పదవీ విరమణ అయిన తర్వాత ఆప్తులను, స్నేహితులను, బంధువులను పలకరించాలి. బంధువుల ఇళ్ళకు వెళ్ళి వాళ్ళతో నాలుగు రోజులు గడపాలి, మంచి,చెడు తెలుసు కొని ప్రేమాప్యాయతతో పలకరించాలి.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే తోచినంత సహాయం చేసి వారి ఆర్థిక అవసరాలు తీర్చాలి, సామాజిక కార్యక్రమాలలో పాల్గొనాలి. ఇలా పదవి విరమణ తర్వాత జీవితం అయిన వాళ్ళను, బంధువులను పలకరిస్తూ, తదుపరి జీవితం కూడా ఆయురారోగ్యాలతో చూడ మని, గతంలో తెలిసో తెలియకో చేసిన తప్పులను క్షమించమని ఆ దైవాన్ని వేడుకుంటూ జీవితాన్ని గడిపితే ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ఉన్నత స్థానంలో ఉంటారు.

మరణానంతర జీవితం అంటూ ఒకటి ఉంది అని, దైవం ఆదేశించిన ప్రతీ దానికి సమాధానం చెప్పవలసి ఉంటుంది అని మనిషి గుర్తించి జీవితం గడిపితే ఇహలోకంలోను, పరలోకంలోను జీవితం సాఫీగా సాగుతుంది. అందరికీ సద్బుద్ధిని ప్రసాదించమని ఆ దైవాన్ని వేడుకుందాం!




## దళితులు, మైనార్టీలపై దాడులు : సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్

దేశంలో న్యాయవ్యవస్థ నుంచి ఎన్నికల సంఘం వరకు ప్రతిదీ ప్రభుత్వ నియంత్రణలో ఉందని సీపీఐ(ఎం) రాజ్యసభ ఉపనేత జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. దళితులు, మైనార్టీలపై దాడుల పరంపర కొనసాగుతోందని అన్నారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో సీపీఐ(ఎం) రాజ్యసభ ఉపనేత జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ దేశం లోని దళిత, మైనారిటీ వర్గాలు సంఘ్ పరివార్ పాలనలో భయంతో జీవిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అని చెబుతోంది. ఈ పాలసీ బాధితురాలైన మహిళ జకియా జాఫ్రీ మరణించింది. వారు న్యాయం కోసం తిరిగారు. వారికి మాత్రమే కాదు, గుజరాత్ మారణహోమంలో ఊచకోత కోయబడిన వారందరికీ న్యాయం కోసం ఆమె తిరిగారు. ఆమె భర్త ఎహ్సాన్ జాఫ్రీ లోక్‌సభ సభ్యుడు. ఆయన్ని కూడా నిర్దాక్షిణ్యంగా చంపేశారు. ఇది మైనారిటీలు ఎదుర్కొంటున్న భయానక వాతావరణం' అని పేర్కొన్నారు.

## జకియా జాఫ్రి మృతి

2002లో జరిగిన గుజరాత్ అల్లర్లలో మరణించిన మాజీ కాంగ్రెస్ ఎంపీ ఎహసాన్ జాఫ్రి సతీమణి జకియా జాఫ్రి (86) ఫిబ్రవరి 1న కన్నుమూశారు. గుల్బర్గ్ సొసైటీలో మరణించిన 69 మందిలో ఎహసాన్ ఒకరు. గోద్రా రైలు దహనం అనంతరం జరిగిన ఈ ఘర్షణలపై జకియా సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయ పోరాటం చేశారు. ఉన్నత స్థాయి రాజకీయ నాయకులను జవాబుదారీ చేయడం కోసం ఆమె అవిశ్రాంతంగా పోరాడారు.

## తెలంగాణలో 12.56 శాతం ముస్లింలు... కులగణన సర్వే వివరాలు వెల్లడి

తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే కులగణన వివరాలను వెల్లడించింది. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కులగణన వివరాలను వెల్లడించారు. తెలంగాణలో 96.9 శాతం కులగణన సర్వే జరిగిందని.. 3.1 శాతం మంది సర్వేలో పాల్గొనలేదని తెలిపారు. తెలంగాణ కులగణన సర్వే దేశ భవిష్యత్తుకు ఓ దిక్సూచి అని అన్నారు. సామాజిక న్యాయం కోసమే సర్వే చేసినట్లు పేర్కొన్నారు.

### కులగణన రిపోర్టు..

తెలంగాణలో కుల గణన సర్వే చేసిన జనాభా 3,54,77,554
మొత్తం కుటుంబాలు 1,12,15,134
కుల గణన ప్రకారం ఎస్సీల జనాభా - 61,84,319.. (17.43 శాతం)
ఎస్టీల జనాభా - 37,05,929.. (10.45 శాతం )
బీసీల జనాభా - 1,64,09,179 (46.25 శాతం)
ముస్లింల జనాభా- 44,57,012 (12.56 శాతం)
బీసీ ముస్లింలు: 35,76,588 (10.08 శాతం)
ఓసీ ముస్లింలు: 8,80,424 (2.48 శాతం)
ఓసీల జనాభా- 44,21,115 (13.31 శాతం)
మొత్తం ఓసీ జనాభా - 15.79 శాతం

తెలంగాణ గృహాలలో 96.9 శాతం సర్వే చేయబడిందని.. 3,54,77,554 వ్యక్తులను కవర్ చేసినట్టుగా రిపోర్టులో పేర్కొంది. ఇది స్వాతంత్ర్యం తర్వాత జరిగిన అతిపెద్ద కుల సర్వేగా నిలిచిందని అన్నారు. ఇక, 76,000 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల్లోపు సమాచారాన్ని డిజిటలైజ్ చేశారు.

## వెల్లివిరిసిన మత సామరస్యం

దేశంలో కుల, మత రాజకీయాలు విషం చిమ్ముతున్న వేళ.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో మత సామరస్యం వెల్లివిరిసింది. పుణ్య స్నానాల కోసం కోట్లాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివస్తుండగా అక్కడి యోగి సర్కార్ ఏర్పాటు చేసిన(మరుగుదొడ్లు, ఇతర) సహాయక కార్యక్రమాలు ఆశించిన మేర సరిపోవడం లేదు. దీంతో ఇది ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలోనే అక్కడి ముస్లింలు ముందుకొచ్చి సాయమందిస్తున్నారు. తాగడానికి గుక్కెడు నీళ్లు ఎవరిస్తారా..? అని ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. కాలకృత్యాలు తీర్చుకోవటం పెద్ద సమస్యగా మారింది. ఇక మహిళల అవస్థలైతే చెప్పలేనివి. ఇవన్నీ గుర్తించిన ప్రయాగ్‌రాజ్‌లోని ముస్లింలు.. తామున్నామంటూ ముందుకొచ్చారు. తమ వంతు సహాయ సహకారాలందిస్తున్నారు. సాధారణంగా హిందూ ఆలయాల్లో ముస్లింలను అనుమతించరు. కానీ ఇక్కడ సీన్ మరోలా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన కార్యక్రమం జరుగుతుంటే.. సర్కారు అందించే సేవలు మాత్రం అంతంతగానే ఉండడంతో ముస్లింలు .. మసీదుల్లో, తమ ఇండ్లల్లో హిందు భక్తులకు ఆశ్రయమిస్తున్నారు. శీతాకాలం కావటం మంచు కురుస్తుండడంతో పిల్లలు, మహిళలు వణికిపోతున్నారు. కాస్తంతా చోటు దొరికితే చాలు అనుకుంటున్న భక్తులకు.. తమ స్థోమతకు తగ్గట్టు ముస్లింలు వసతి సౌకర్యం కల్పించడంతో పాటు భోజనాలు, దుప్పట్లు, కంబలి ఇలా ఏది ఉంటే అది ఇచ్చి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. వీరి ఆతిథ్యానికి భక్తులు పులకరించిపోతున్నారు. దేశమంతటా మతరాజకీయాల చిచ్చు పెడుతున్నా.. మాకు ఇంతలా సేవలందిస్తారని ఊహించలేదని పలువురు భక్తులు పేర్కొనటం గమనార్హం. అక్కడ ముస్లింలు అందిస్తున్న ఈ సేవలను స్థానిక కార్పొరేట్ మీడియా మరుగునబెడితే.. బీబీసీ, ఇతర అంతర్జాతీయ మీడియా హైలెట్ చేయటం విశేషం.




## సౌదీ అరేబియాలో మార్చి 1నుంచి రమజాన్ నెల షురూ

సౌదీ అరేబియాలో రమజాన్ నెల మార్చి 1నుంచి ప్రారంభమవుతుందని సౌదీ అరేబియా మంత్రిత్వ శాఖ ఒకప్రకటనలో తెలిపింది. చాంద్రమాన లెక్కల ప్రకారం మార్చి 1నుంచి రమజాన్ మొదటి రోజా ప్రారంభమయ్యే అవకాశముందని సౌదీ అరేబియా ఉలమా బోర్డు సభ్యులు షేఖ్ అబ్దుల్లాహ్ సల్మాన్ తెలిపారు. ఈ ఏడాది రమజాన్ నెల 29 రోజులని, మార్చి 30న ఈదుల్ ఫిత్ర్ అవుతుందని పేర్కొన్నారు. ఆకాశంలో నెలవంక కనిపించాక అధికారికంగా రమజాన్ నెల ప్రకటన సౌదీ సుప్రీంకోర్టు ప్రకటిస్తుందని ఆయన చెప్పారు. 2031 వరకూ ఎనిమిదేళ్లపాటు రమజాన్ నెల చలికాలంలో వస్తుందని తెలిపారు.

## గాజాను స్వాధీనం చేసుకుంటాం : ట్రంప్ సంచలన ప్రకటన

గాజాను స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో భేటీ అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ , గాజా యుద్ధం నేపథ్యంలో తాజా పరిస్థితిపై నెతన్యాహుతో ట్రంప్ చర్చించారు. ‘ గాజాను అమెరికా స్వాధీనం చేసుకుంటుంది. అక్కడ ధ్వంసమైన భవనాలను పునరుద్ధరిస్తాం. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తే , అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పించవచ్చు. ఇళ్లు నిర్మించవచ్చు” అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటన చరిత్రను మారుస్తుందని నెతన్యాహు అభిప్రాయపడ్డారు. గాజాలో ఉద్రిక్తతల కారణంగా నిరాశ్రయులుగా మారిన పాలస్తీనీయులకు అరబ్ దేశాలు ఆశ్రయం కల్పించాలని ఇటీవల ట్రంప్ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. గాజాను స్వాధీనం చేసుకుంటానంటూ ట్రంప్ ప్రకటించడాన్ని హమాస్ ఖండించింది.

## గ్లోబర్ టీచర్ ప్రైజ్ 2025 రేసులో భారతీయుడు

సాంకేతికతను వినూత్నంగా వినియోగించిన గ్రామీణ విద్య గతిని మార్చిన రాజస్థాన్‌కు చెందిన మార్గదర్శక విద్యావేత్త మొహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ మేవాతీ జెమ్స్ ఎడ్యుకేషన్ గ్లోబల్ టీచర్‌ప్రైజ్ 2025 రేసులో నిలిచాడు. ఈమేరకు తుది పదిమంది జాబితాలో ఆయన చోటు దక్కించుకున్నారు. ఈ బహుమతికి ఎంపికైన వ్యక్తికి సుమారు రూ.8.65 కోట్లు (10 లక్షల అమెరికన్ డాలర్లు ) లభించనున్నాయి. తరగతి గదులకే పరిమితం కాకుండా మౌలిక సదుపాయాల సవాళ్లను పరిష్కరించడం, వందల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, పర్యావరణ సారథ్యాన్ని పెంపొందించడం వంటి పనులకు గాను మేవాతీకి ప్రధాని నరేంద్రమోడీ నుంచి సహా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. అతని అంకిత భావం పరివర్తనాత్మక విద్యకు ఉదాహరణగా, స్థానిక కమ్యూనిటీలకు స్ఫూర్తిగా నిలుస్తోందని, గ్లోబల్ టీచర్ ప్రైజ్ ప్యానల్ కొనియాడింది. జెమ్స్ ఎడ్యుకేషన్ గ్లోబల్ టీచర్ ప్రైజ్ 2025 కు సంబంధించి తుది పదిమందిలో చోటు దక్కించుకోవడంపై మేవాతీ స్పందించారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత స్ఫూర్తిమంతమైన విద్యావేత్తల సరసన నిలబడడం గౌరవంగా భావిస్తున్నట్టు వెల్లడించారు.



## జన్మతః పౌరసత్వం బానిసల పిల్లల కోసమే ప్రపంచమంతా అమెరికాలో తిష్ట వేసేందుకు కాదు: ట్రంప్

జన్మతః పౌరసత్వం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ హక్కు కేవలం బానిసల పిల్లల కోసం కల్పించినదని, అంతే తప్ప.. ప్రపంచం మొత్తం వచ్చి అమెరికాలో తిష్ట వేసేందుకు కాదని అన్నారు. అధికారంలోకి వచ్చీరాగానే జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ ట్రంప్ ఆదేశాలు జారీ చేయడం, ఇది వివాదాస్పదం కావడంతో న్యాయస్థానం ఆ ఉత్తర్వులను నిలిపివేయడం తెలిసిందే. కాగా, ఈ అంశంపై ట్రంప్ తాజాగా స్పందిస్తూ, “గతాన్ని ఓసారి పరిశీలిస్తే జన్మతః పౌరసత్వ హక్కును బానిసల పిల్లల కోసం కల్పించిందనే విషయం స్పష్టమవుతుంది. అంతే తప్ప.. ప్రపంచం మొత్తం వచ్చి అమెరికాను ఆక్రమించుకునేందుకు కాదు. అర్హత లేనివారు కూడా ఇక్కడికి వస్తున్నారు. తద్వారా అర్హత లేని పిల్లలకు పౌరసత్వం దక్కుతోంది” అని వ్యాఖ్యానించారు.

# తల్లిదండ్రులను గౌరవించాలి

**ముహమ్మద్ వహీదుద్దీన్**

**దివ్య ఖుర్ఆన్**లో దైవం అనేకచోట్ల మానవుల హక్కులను, వారి బాధ్యతలను తెలుపుతున్నాడు. తల్లిదండ్రులు కలవారు మిక్కిలి ధన్యులు. సంతానం వారికి సేవ చేసి దైవ ప్రేమకు పాత్రులు కావాలి. తల్లిదండ్రులకు సేవ చేయనివారు పరమ దుర్మార్గులు. వారికి కఠినశిక్ష ఉంది. తల్లి దండ్రులు వృద్ధులై ఉంటే వారిని ఈసడించుకోవద్దు. వారితో అణకువగా, మర్యాదగా మాట్లాడండి. పసితనంలో మిమ్మల్ని ఎంత ప్రేమగా పెంచారో అదే మాదిరిగా వృద్ధాప్యంలో వారిపై ప్రేమ చూపండి. తల్లి పాదాల క్రింద స్వర్గం ఉందని మహాప్రవక్త(స) ఉపదేశించారు.

మహాప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: ఒక వ్యక్తి మహాప్రవక్త(స) వద్దకు వచ్చి, దైవ ప్రవక్తా! సేవ, సద్వర్తనలకు అందరి కంటే అధికంగా హక్కు గలవారెవరు? అని అడిగారు. 'నీ తల్లి' అని సమాధానం చెప్పారు మహాప్రవక్త(స). అతను తిరిగి అడిగాడు 'ఆ తరువాత ఎవరు?' అని. 'నీ తల్లి' సమాధానం వచ్చింది తిరిగి. అతను 'ఆ తరువాత?' అని అడగ్గా 'నీ తల్లి' అనే సమాధానం పలికారాయన. అతడు మరోసారి 'ఆ తరువాత ఎవరు?' అని అడిగాడు. అప్పుడు 'నీ తండ్రి' ఆ తరువాత బంధుత్వపు క్రమంలో నీ సన్నిహితులు అని బదులు ఇచ్చారు ప్రవక్త మహనీయులు(స). (బుఖారీ, ముస్లిమ్)

దైవ ప్రవక్త ఒకసారి, 'వాడి ముక్కుకు మన్నుతగల' అని మూడు పర్యాయాలు సెలవిచ్చారు. 'ఎవరు వాడు, దైవ ప్రవక్తా!'' అని అడిగారు అక్కడున్నవారు. 'తన తల్లిదండ్రుల్ని వారిద్దరినో లేక వారిలో ఒక్కరినో, వృద్ధాప్యంలో చూసి (వారి సేవ చేసి) స్వర్గంలో ప్రవేశించనివాడు' అని పలికారు దైవ ప్రవక్త(స). (ముస్లిమ్)


మహాప్రవక్త(స) కూర్చొని ఉండగా "బనూ సలిమ" తెగకు చెందిన వ్యక్తి ఒకతను వచ్చాడు. అతను దైవప్రవక్తా! తల్లిదండ్రులు గతించిన తరువాత వారి ఎడల నాపై ఏదయినా బాధ్యత ఉంటుందా? అని అడిగాడు. అప్పుడు మహా ప్రవక్త(స) ఇలా ఉపదేశించారు: "అవును ఉంటుంది వారి మోక్షం కొరకు, క్షమాపణ కొరకు దైవ సన్నిధిలో ప్రార్థించు. వారు వ్రాసిపోయిన ధర్మ సమ్మతమైన విల్లు ప్రకారం ఆచరించు. వారి బంధువుల పట్ల ప్రేమతో, దయతో మెలుగు వారి మిత్రులతో గౌరవంగా, మర్యాదగా ప్రవర్తించు". (అబూదావూద్)

వృద్ధాప్యంలో వారికి సహాయం ఎక్కువగా అవసరమవుతుంది. సంతానం తమకు కేవలం అన్నపానీయాలు, వస్త్రాలు మొదలైనవి ఏర్పాటు చేయాలని మాత్రమే కాదు. సమాజంలో తాము ఒంటరి వారుగా, చేతకాని వారుగా మిగిలిపోతామన్న అభద్రతా భావంతో, నిరాశతో అపోహ పడకుండా తమ వార్ధక్య చింతలను దూరం చేసే ప్రేమాభిమానాల కోసం వారు పరితపిస్తుంటారు.

తమ వార్ధక్యాన్ని వయసుతోపాటు తమ జవసత్వాలు తరిగి పోవడాన్ని తమ సంతానం సానుభూతితో అర్థం చేసుకుని, తమను పెద్దలుగా గౌరవించాలని, తమ ఎడల ప్రేమతో, అప్యాయతానురాగాలతో, గౌరవ మర్యాదలతో వ్యవహరించాలని కోరుకుంటారు.

దివ్య ఖుర్ఆన్ తల్లిదండ్రుల పోషణా బాధ్యత మాత్రమే తమ సంతానంపై పెట్టలేదు. పైగా కష్ట సమయాల్లో, ఏ ఆధారంలేని సమయంలో సానుభూతితో, ప్రేమతో కూడిన ఓ చల్లని మాట, ధన సహాయం కన్నా ఎన్నోరెట్లు విలువైనదిగా ఉంటుంది. మృదువైన మాటకు,ఉదాత్త బోధనలకు, ఆప్యాయతతో కూడిన పలకరింపునకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది దివ్య ఖుర్ఆన్ గ్రంథం.

**తు ది గీ టు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**